ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



అన్నమయ్య

జిల్లా వార్తలు

5

శుక్రవారం 27 సెప్టెంబరు 2024



పెద్ద సారూ.. వసూళ్లూ పెద్దగానే..!

- 22ఏ, ఫ్రీహోల్డ్ ఫైళ్లలో భారీ కలెక్షన్లు
- సార్ చేతికి అంటకుండా... బ్రోకర్లే పని కానిచ్చేస్తారు..
- కింది స్థాయి సిబ్బందికి ఆయనంటే హడల్
- నోరు తెరిస్తే బండబూతులే
- కలెక్టరేట్లో ఎక్కడ చూసినా ఆ సార్.. గురించే చర్చ

(రాయచోటి-ఆంధ్రజ్యోతి)/కలెక్టరేట్: జిల్లా రెవెన్యూ శాఖలో ఆయనో పెద్ద సార్.. పెద్ద సార్ అంటే.. మరీ అంత పెద్ద సార్ కాదు కానీ.. మొత్తానికి పెద్దసారే.. ఆయన.. తన స్థాయికి తగ్గట్టు వసూళ్లు కూడా పెద్దగానే చేస్తున్నారు. ఎంత పెద్దగా అంటే జిల్లా వ్యాప్తంగా ఈ వసూళ్లు చేయడానికి ముగ్గురు బ్రోకర్లను పెట్టుకునేంత. ఈ బ్రోకర్లు సార్ చేతికి మట్టి అంటకుండా అంతా తామే చూసుకుంటారు. తమ పనులు చేయించుకునే వాళ్లు సైతం పెద్ద మొత్తంలోనే అడుగుతున్నా అందులోనూ అప్పటి అధికార వైసీపీలోని ముఖ్యులతో చాలా సన్నిహిత సంబంధాలు కలిగి ఉండే పెద్దసార్ కాబట్టి.. ఎందుకొచ్చిన తంటరా బాబూ... అనుకుంటూ కిక్కురు మనకుండా అడిగినంత ఇచ్చేశారు. ఇప్పుడు ఈ పెద్ద సార్ వసూళ్ల బాగోతం రెవెన్యూ శాఖలో, చుట్టుపక్కల జిల్లాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. గత ప్రభుత్వంలో 22ఏ, ఫ్రీహోల్డ్ ఫైళ్లను ఆదాయవనరుగా మార్చుకున్న సదరు పెద్ద సారు.. భారీగానే వసూళ్లకు పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఉన్నప్పటికీ కలెక్టరేట్‌లో ఏవైనా 22ఏ, ఫ్రీహోల్డ్ ఫైళ్లు వేగంగా కదులుతున్నాయి అంటే ఈ పెద్దసారుకు బాగానే ముట్టిందనేది అర్థమవుతుందని పలువురు పేర్కొంటుంటారు. వసూళ్లలోనే కాకుండా తన కింద పనిచేసే సిబ్బందిని బండబూతులు తిట్టడంలోనూ ఆయన పెద్దతనమే చూపించేవాడని చెబుతున్నారు. ఆయన కింద వివిధ సెక్షన్లలో పనిచేసే పలువురు సిబ్బంది ఈయన ఆగడాలు భరించలేకున్నాం. దయవుంచి ఆయనను ఇక్కడి నుంచి బదిలీ చేయించమని కూటమి ప్రభుత్వంలోని ముఖ్యులను కలిసి మొరపెట్టుకున్నారంటే ఈయన పెద్దతనం ఏపాటిదో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఈ పెద్దసార్ చేసిన పెద్ద పెద్ద పనుల్లో మచ్చుకు కొన్ని..

- జిల్లాలో రాయచోటి, మదనపల్లె, రాజంపేట సబ్ డివిజన్‌లలో చుక్కల భూములు ఎక్కువ. దీంతో వివాదాలు కూడా ఎక్కువే. ఈ నేపథ్యంలో 22ఏ ఫైళ్లు (నిషేధిత భూములు) ఎక్కువగా వస్తుంటాయి. అదే సమయంలో అప్పట్లో వైసీపీ ప్రభుత్వం ఉండటంతో నిబంధనలతో సంబంధం లేకుండా అడ్డదిడ్డమైన ఫైళ్లు అనేకం వచ్చాయి. ఈ ఫైళ్లను ఆదాయ వనరుగా మార్చుకున్న కొందరు అధికారులు అడ్డూఅదుపు లేకుండా చెలరేగిపోయారు. తాము ఎటువంటి ఫైళ్లు క్లియర్ చేస్తున్నామనే స్పృహ లేకుండా చేసేసి రెండు చేతులా డబ్బు సంపాదించుకున్నారు. ఇలా వచ్చిన ఫైళ్లు వేగంగా క్లియర్ కావడానికి పెద్దసార్ ప్రత్యేక శ్రద్ధ చూపేవాడని ఆరోపణలు ఉన్నాయి. తమ బ్రోకర్ల చేతిలోకి డబ్బు పడగానే ఏ సెక్షన్‌లో పనిచేసే ఒక ఉద్యోగికి ఫోన్ చేసి ఆ ఫైల్ త్వరగా చూడమని బెదిరించేవాడని తెలుస్తోంది. మదనపల్లె మండలం బసినికొండ గ్రామంలో సర్వే నెంబరు 1/1 లో 4.91 ఎకరాలు నిషేధిత జాబితా నుంచి బయటపడడం వెనుక భారీ మొత్తం చేతులు మారిందనే ఆరోపణలు ఉన్నాయి. ఇందులో పెద్దసార్‌కు పెద్దమొత్తమే ముట్టినట్లు సమాచారం.
- రాయచోటి నియోజకవర్గం లక్కిరెడ్డిపల్లె చెందిన ఓ వైసీపీ నాయకుడు రామాపురం మండలం చిట్లూరు గ్రామం జాతీయ రహదారికి పక్కన ఉన్న రెండు ఎకరాల పొలం ఫైల్ క్లియర్ కోసం రూ.40 లక్షలు సమర్పించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.
- రాయచోటి పట్టణం పెమ్మాడపల్లె గ్రామం గున్నికుంట్ల రోడ్డులో ఓ చుక్కల భూమిని నిబంధనలకు విరుద్ధంగా క్లియర్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీనికోసం ఈ పెద్దసార్ రూ.5 లక్షలు తీసుకున్నట్లు కలెక్టర్ కార్యాలయం, రాయచోటి తహసీల్దార్ కార్యాలయం కోడై కూస్తోంది.
- గతంలో సుండుపల్లె మండలంలో పనిచేస్తున్న ఓ తహసీల్దార్‌ను మదనపల్లె సబ్‌డివిజన్ బదిలీ చేసేందుకు మామూళ్లు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.
- రాయచోటి మండలం సుద్దలవాండ్లపల్లె రోడ్డులో సర్వే నెంబరు 535, 533లో కొంత చుక్కల భూమికి ఎన్‌వోసీ ఇచ్చేందుకు ఇటీవలే సదరు పెద్దసార్ ఫైల్ ముందుకు నడిపినట్లు సమాచారం. అయితే ఆయన కంటే పెద్దసార్ ఆ ఫైల్‌లో లోపాలున్నాయని తిరస్కరించినట్లు తెలుస్తోంది.
- 2024 సార్వత్రిక ఎన్నికల కోసం ప్రతి మండలానికి ఎన్నికల బడ్జెట్ విడుదల అయింది. తహసీల్దార్లకు ఈ మొత్తం ఇవ్వడంలోనూ ఆ సార్ చిలక్కొట్టుడు కొట్టాడనే ఆరోపణలు ఉన్నాయి.
- కొత్త జిల్లాలో తనకు వాహన సదుపాయం లేకపోయినా ప్రతి నెలా వాహన అలవెన్స్ తీసుకుంటున్నాడనే ఆరోపణలు ఉన్నాయి.
- సుమారు మూడు నెలల క్రితం ప్రమాదవశాత్తు టిప్పర్ తగిలి జాతీయ రహదారి దగ్గర ఉన్న కలెక్టరేట్ ఆర్చి ధ్వంసం అయింది. దానిని రిపేరు చేయించడానికి ఆర్‌అండ్‌బీ శాఖ వేసిన అంచనా మొత్తం కంటే ఎక్కువగా బిల్లు పెడితే ఆయన కంటే పెద్దసార్ దానిని తిరస్కరించినట్లు ప్రచారంలో ఉంది.

ఫ్రీహోల్డ్‌లో కాసుల పంటే

వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఫ్రీహోల్డ్ చట్టం లబ్ధిదారులకు ఎంత మేలు చేసిందో కానీ.. రెవెన్యూలో పలువురికి కాసుల పంటే పండించిందని చెప్పవచ్చు. జిల్లా వ్యాప్తంగా లక్షా 42 వేల ఎకరాలు ఫ్రీహోల్డ్‌లో ఉండగా అందులో 4800 ఎకరాలు ఇప్పటికే రిజిస్టర్ కూడా అయిపోయాయి. అందులో దాదాపు 45 శాతం అక్రమంగా జరిగినట్లు ఇటీవలే రెవెన్యూ అధికారులు తమ విచారణలో తేల్చారు. ఈ ఫైళ్లలో పెద్దసార్‌కు పెద్ద వాటానే దక్కినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు లేకపోయినా అన్ని వేల ఎకరాలు ఎలా జరిగాయో? ఆ ఫైళ్లు క్లియర్ కావడానికి ఈ పెద్దసార్ ఏ విధంగా సంతకం చేశాడో? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.



నోరు తెరిస్తే బండబూతులే..

ఏ యూనివర్సిటీ అయినా బండబూతులు తిట్టే వాళ్లకు పీహెచ్‌డీ ఇచ్చేట్లయితే మా సార్‌కు ఇచ్చేయవచ్చు.. ఇదీ ఈయన కింద వివిధ సెక్షన్లలో పనిచేసే సిబ్బంది మనసులో మాట. సిబ్బందిని ఎంత మాట అంటే..అంత మాట అనేస్తాడని పలువురు వాపోతున్నారు. పత్రికల్లో రాయలేని విధంగా బూతులు తిడతాడని ఆవేదన చెందుతున్నారు. గతంలో ఓ సెక్షన్ సూపరింటెండెంట్‌పై ఈ సార్ దురుసుగా ప్రవర్తిస్తే.. అప్పుడు న్న కలెక్టర్ ఇతడితో క్షమాపణలు చెప్పించినట్లు తెలిసింది. ఈ పెద్దసార్ ఉండే.. పెద్ద ఇంటికి నెలనెలా బాడుగను ఈయనకు మామూళ్ల వసూలు చేసి పెట్టే బ్రోకర్లే చెల్లిస్తుండటం విశేషం.

అన్నీ చూసుకునే ముగ్గురు బ్రోకర్లు

ఈయన మామూళ్ల వ్యవహారాన్ని ఒక్కో రెవెన్యూ డివిజన్‌కు ఒక్కో బ్రోకర్ పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. ముగ్గురూ ఈయన సామాజికవర్గానికి చెందిన బయటి వ్యక్తులు కావడం విశేషం. రాయచోటిలో పుష్ప.... మదనపల్లెలో సత్య.. రాజంపేటలో హనుమంతు.. అనే వాళ్లు బ్రోకర్లుగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. కలెక్టర్ కార్యాలయానికి 22ఏ ఫైల్ రాగానే ఈయనే తన బ్రోకర్లను రంగంలోకి దింపేవాడని సమాచారం. ఆ బ్రోకర్లు ఫైల్ పంపిన వ్యక్తులతో మాట్లాడి డీల్ సెట్ చేసే వాళ్లని పలువురు పేర్కొంటున్నారు. బ్రోకర్ల చేతికి డబ్బు పడగానే ఫైల్ కదలికలో వేగం పెరిగేదని తెలుస్తోంది. మదనపల్లె, రాజంపేట బ్రోకర్లు తాము వసూలు చేసిన మొత్తాన్ని రాయచోటిలోని బ్రోకర్ చేతికి ఇచ్చేవారని సమాచారం. ఈ మొత్తం కూడా ఎప్పటికప్పుడు కాకుండా.. నెలకో, రెండు నెలలకో ఈ సార్ తీసుకునేవాడని సమాచారం.

మదనపల్లె మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్లను విచారిస్తున్న మున్సిపల్ ఆర్డీ విశ్వనాథ్



మున్సిపల్ కమిషనర్ల విచారణ

- ఎనిమిదేళ్ల క్రితం మున్సిపల్ ఉద్యోగి పిటీషన్
- నిర్లక్ష్యం వహించిన అధికారులు
- విచారించిన మున్సిపల్ ఆర్డీ

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 26: రిటైర్మెంట్ పెన్షన్ విషయమై ఓ మున్సిపల్ ఉద్యోగి ఎనిమిదేళ్ల క్రితం హైకోర్టులో పిటిషన్ వేయగా, దీనికి అప్పట్లో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయని మున్సిపల్ కమిషనర్‌ను ఆర్డీ విచారించారు. అనంతపురం మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ విశ్వనాథ్ గురువారం మదనపల్లె మున్సిపల్ కార్యాలయానికి వచ్చి ప్రస్తుత కమిషనర్ ప్రమీల, గతంలో పనిచేసిన కమిషనర్ రఘునాథరెడ్డిలను విచారించారు. ఆర్డీ కథనం మేరకు.. మదనపల్లె మున్సిపాలిటీలో 1986లో మేస్త్రీగా విధుల్లో చేరిన ప్రభాకర్‌కు 2011 సంవత్సరంలో పర్మనెంట్ ఉద్యోగిగా ఉత్తర్వులు వచ్చాయి. అనంతరం 2014లో చైన్‌మ్యాన్‌గా పదోన్నతి పొందిన అతనికి 212 జీవో ప్రకారం ఓపీఎస్ పద్ధతిలో పెన్షన్ రావాల్సి ఉండగా, రాలేదని ప్రభాకర్ హైకోర్టులో పిటీషన్ వేశాడు. ఈ క్రమంలో సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటీషన్ వేయాల్సిన మున్సిపల్ అధికారులు విస్మరించారు. ప్రభాకర్ పిటీషన్‌పై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాల్సిన అప్పటి కమిషనర్ నిర్లక్ష్యం చేయడంపై హైకోర్టు నుంచి చార్జిఫ్రేమ్ ఉత్తర్వులు వచ్చాయి. హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయడంలో చాలా ఆలస్యం చేశారని, 2019లో కోర్టు ప్రొసీడింగ్స్ అమలు చేయకపోవడంపై ఇద్దరు కమిషనర్లను ఆర్డీ విచారించారు. ఆ సమయంలో తాము మదనపల్లెలో విధుల్లో లేమని ఇద్దరు కమిషనర్లు ఆర్డీకి వివరించారు. దీనిపై అప్పట్లో ఎవరు కమిషనర్‌గా ఉన్నారో, వారి వివరాలను, హైకోర్టులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయపోవడాన్ని వివరిస్తూ నివేదికలు ఇవ్వాలని కమిషనర్ ప్రమీలను ఆదేశించారు. ఈ నివేదికల ఆధారంగా అప్పట్లో పనిచేసిన కమిషనర్‌పై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ఆర్డీ వెల్లడించారు.

ఉపాధి, వెలుగు పథకాలు అద్భుతం

- కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ పర్యవేక్షకుడు సుధాకర్‌రెడ్డి



పక్కాగృహాల నిర్మాణాలను పరిశీలించి అధికారుల నుంచి వివరాలు సేకరిస్తున్న సుధాకర్‌రెడ్డి

ములకలచెరువు, సెప్టెంబరు 26: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్రామీణ ఉపాధి హామీ, వెలుగు పథకాలు అద్భుతమని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ పర్యవేక్షకులు, నేషనల్ లెవల్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సుధాకర్‌రెడ్డి తెలిపారు. ములకలచెరువు, సోంపల్లె, దేవళచెరువు గ్రామాల్లో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మూడు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించి కూలీల అభిప్రాయాలు సేకరించారు. అలాగే వెలుగు సంఘాల మహిళలతో సమావేశాలు ఏర్పాటు చేశారు. ములకలచెరువు సమీపంలో జరుగుతున్న పక్కాగృహాల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి, వెలుగు పథకాలతో కుటుంబ పరిస్థితులు మెరుగుపడడంతో పాటు గ్రామాభివృద్ధికి దోహదపడుతాయన్నారు. ఏపీలో అమలవుతున్న వెలుగు పథకం మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా ఉందన్నారు. ఉపాధి హామీ పథకంలో 100 రోజులు పనులు చేస్తున్న శాతం మహిళలదే ఉందన్నారు. ప్రభుత్వ పథకాలను, గ్రామ సచివాలయాల్లో అందుతున్న సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమాల్లో ఇన్‌చార్జి ఎంపీడీవో గౌస్‌బాషా, ఈవోఆర్డీ మోహన్‌ప్రతాప్, పీఆర్ ఏఈ అనిత, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ బాలచంద్రాచారి, ఎంఈవో వెంకటరమణ, ఏపీఎం హరి, ఏపీవో నారాయణస్వామి, ఉపాధి ఇంజనీరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుకు రూ.కోటి పంపిణీ


- రాష్ట్రంలో 11 మందికి.. జిల్లాలో ఒకరే ఎంపిక
- రూ.50 లక్షలు సబ్సిడీ అందుకుంటున్న రైతు
- పథకంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి : సబ్ కలెక్టర్



చిన్నరెడ్డెప్పరెడ్డికి రూ.కోటి చెక్కు అందజేస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 26: జాతీయ పశుగణాభివృద్ధి పథకం (ఎన్ఎల్ఎం) కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఔత్సాహిక వ్యాపారవేత్తల ప్రోత్సాహం పథకం కింద రైతు ఎం.చిన్నరెడ్డెప్పరెడ్డికి రూ.కోటి చెక్కును ప్రభుత్వం అందించిందని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తెలిపారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో అంకిశెట్టి పశువైద్యాధికారి డాక్టర్ లారెన్స్ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ చేతుల మీదుగా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ పశుగణాభివృద్ధి ఎన్ఎల్ఎం పథకం కింద రైతులు ఆవులు, గొర్రెలు, పొట్టేళ్లు, మేకల పెంపకాన్ని రూ.50 లక్షలతో ప్రాజెక్టు ప్రారంభిస్తే దానికి కేంద్ర ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ (రూ.50 లక్షలు) అదనంగా ఇస్తుందన్నారు. ఒకవేళ అంత పెట్టుబడి పెట్టలేని రైతులు వారి స్థోమతను బట్టి పెట్టుబడి పెట్టి ప్రాజెక్టు ప్రారంభిస్తే, పెట్టుబడికి 50 శాతం సబ్సిడీ ప్రభుత్వం ఇస్తుందన్నారు. అంతా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రాష్ట్రంలో ఎన్ఎల్ఎం పథకం కింద 11 మందికి మాత్రమే రూ.కోటి చొప్పున మంజూరు కాగా అందులో జిల్లాలోని రామసముద్రం మండలం అరికెల పంచాయతీకి చెందిన ఎం.చిన్నరెడ్డెప్పరెడ్డికి రూ.కోటి మంజూరైందన్నారు. ఈ రైతు తొలుత 16 లక్షలు మాత్రమే పెట్టుబడి పెట్టి, మిగిలిన 34 లక్షలు బ్యాంకు రుణం పొందారని, నిబంధనల ప్రకారం ప్రాజెక్టు ప్రారంభించాక, ఈ నివేదికలను పశువైద్యాధికారులు ఉన్నతాధికారులకు పంపుతారన్నారు. మొత్తం పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం రైతుకు పెట్టుబడి కింద రూ.50 లక్షలతో పాటు సబ్సిడీ రూ.50 లక్షలు కలిపి రూ.కోటి రైతు అకౌంటులో జమ చేస్తుందన్నారు. కర్ణాటక, మహారాష్ట్ర రైతులు ఈ పథకంతో ఎక్కువ లబ్ధి పొందుతున్నారని, ఈ ప్రాంత రైతులు కూడా అవగాహన పెంచుకుని ఎన్ఎల్ఎం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సబ్‌కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ లారెన్స్, సిబ్బంది పాల్గొన్నారు.

రాజంపేట మున్సిపల్ కమిషనర్‌గా నాగేశ్వరరావు



రాజంపేట, సెప్టెంబరు 26: రాజంపేట మున్సిపల్ కమిషనర్‌గా వి.నాగేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తూ రాజంపేటకు బదిలీ అయ్యారు. ఈయనకు గతంలో అనేకచోట్ల మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట పట్టణాన్ని పాలక మండలి సహకారంతో అన్నివిధాల అభివృద్ధి చేస్తామన్నారు. నాగేశ్వరరావును మున్సిపల్ సిబ్బంది సన్మానించారు.

ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి

- వారం లోగా ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు
- కలెక్టర్ శ్రీధర్ చామకూరి



ప్రభుత్వాసుపత్రిలో బెడ్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

తంబళ్లపల్లె, సెప్టెంబరు 26: తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచడంతో పాటు వారంలోగా ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ వైద్యాధికారిని ఆదేశించారు. గురువారం కలెక్టరు మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి (సీహెచ్‌సీ), అంగన్వాడీ కేంద్రం, తహసీల్దారు కార్యాలయాలను తనిఖీ చేశారు. తొలుత ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఆసుపత్రిలో స్కానింగ్ గది, ఓపీ వివరాలు, ల్యాబ్, ఫ్యామిలీ ప్లానింగ్ వార్డు, మందుల స్టాకు, బెడ్స్ తదితర విభాగాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మందుల స్టాకు రికార్డులు సరిగ్గా నిర్వహించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రి గురించి వైద్యాధికారి వెంకట్రామయ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ పీహెచ్‌సీల్లోనే నెలకు 20 నుంచి 30 వరకు ప్రసవాలు జరుగుతుంటే ఇక్కడ కేవలం ఏడు ప్రసవాలు మాత్రమే జరిగాయని, ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని ఆదేశించారు. ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ లేని విషయం తన దృష్టికి వచ్చిందని, వారంలోగా ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆర్థోపెడిక్, ఈఎన్టీ వైద్యులు లేరని సిబ్బంది తెలుపగా వెంటనే నివేదికలు పంపాలని సూచించారు. పక్క జిల్లాకు డిప్యుటేషన్‌పై వెళ్లిన ఇక్కడి వైద్యుడికి దానిని రద్దు చేసి తిరిగి ఇక్కడే సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వాసుపత్రి పూర్వపు గేటు ఉన్న స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారనే విషయాన్ని స్థానిక కూటమి నేత పురుషోత్తం కలెక్టరు దృష్టికి తెచ్చారు. స్పందించిన కలెక్టరు ఆసుపత్రి ముందు అక్రమ నిర్మాణాలు చేపడుతున్న స్థలాన్ని పరిశీలించారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని, అలాగే ఆసుపత్రి స్థలం సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని తహసీల్దార్ హరికుమార్‌ను ఆదేశించారు.

గండికోటలో పర్యాటక సంబరం

- ఏర్పాట్లు చేసిన అధికారులు
- నేడు పర్యాటక దినోత్సవం




కొండల మధ్య గండికోట ప్రాజెక్టు

కడప (కల్చరల్), సెప్టెంబరు 26: గండికోటలో పర్యాటక ఉత్సవాలకు జిల్లా, స్థానిక అధికారులు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు గండికోటలో పర్యాటక ఉత్సవాలు (పర్యాటక దినోత్సవం) నిర్వహించనున్నారు. ఇక్కడ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరిగాయి. ఈ మేరకు గురువారం సాయంత్రం పోలీసు అధికారులు, పర్యాటక శాఖ జిల్లా, స్థానిక అధికారులు, సర్పంచ్ ఈశ్వర్ తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు.

నేడు గండికోటకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆర్టీసీ కడప రీజియన్ పరిధిలో గండికోటకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని ఆర్టీసీ కడప రీజియన్ పర్సనల్ ఆఫీసర్ ధనలక్ష్మి తెలిపారు. అందులో భాగంగా కడప డిపో నుంచి ఉదయం 9 గంటలకు మధ్యాహ్నం 12 గంటలకు ప్రత్యేక బస్సులు గండికోటకు వెళతాయన్నారు. తిరుగు ప్రయాణంలో భాగంగా రాత్రి 7-30 గంటలకు గండికోట నుంచి కడపకు బస్సులు బయలుదేరుతాయన్నారు. జమ్మలమడుగు డిపో నుంచి గండికోటకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 వరకూ ప్రతీ గంటకు ఒక బస్సు చొప్పున ఏర్పాటు చేశామని డిపో మేనేజర్ ప్రవీణ్ తెలిపారు.

హార్సిలీహిల్స్‌కు అవార్డు



హార్సిలీహిల్స్ వ్యూ

బి.కొత్తకోట, సెప్టెంబరు 26: ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ ప్రత్యేక అవార్డుకు ఎంపికైంది. పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలకు వాటి ప్రాధాన్యత, ప్రత్యేకత, భౌగోళిక స్వరూపం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం అవార్డులను ఇవ్వనుంది. ఇందులో భాగంగా ప్రత్యేక భౌగోళిక స్వరూపం, ఆహ్లాదకరమైన వాతావరణంతో సముద్రమట్టానికి 4312 అడుగుల ఎత్తులో వున్న హార్సిలీహిల్స్‌కు షూటింగ్‌స్పాట్ విభాగంలో అవార్డు ఇవ్వనున్నట్లు సమాచారం. శుక్రవారం విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనున్న ఈ అవార్డును పర్యాటకశాఖ హిల్స్ ప్రతినిధులు అందుకోనున్నారు.

హౌసింగ్‌లో లక్ష్యాలను పూర్తి చేయాలి

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి (కలెక్టరేట్), సెప్టెంబరు 26: ఎన్టీఆర్ హౌసింగ్ ఇళ్ల నిర్మాణ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం గృహ నిర్మాణ పథకంపై సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులు, సచివాలయ సిబ్బందితో కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పేదలందరికీ సొంతింటి కల సాకారం చేసే విధంగా ఇప్పటికే మంజూరైన ఎన్టీఆర్ ఇళ్ల నిర్మాణాలను డిసెంబరు 31వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. ఈనెల 28న జరగబోయే 'మన ఇళ్లు - మన గౌరవం' కార్యక్రమంలో భాగంగా పెద్ద లేఅవుట్‌లకు కేటాయించిన ప్రత్యేక అధికారులు, హౌసింగ్ అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో రాజంపేట సబ్ కలెక్టరు నిదియాదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా కాలువ విస్తరణ పనులకు శ్రీకారం

- 225.35 కిలోమీటర్లు.. రూ. 348 కోట్లు
- దేవప్పకోట సమీపంలో పనులకు భూమి పూజ
- భూమి పూజ చేసిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

పెద్దతిప్పసముద్రం, సెప్టెంబరు 26: రాష్ట్రంలోని పడమటి ప్రాంతాలైన తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు, పలమనేరు, కుప్పం ప్రాంత రైతులకు సాగు, తాగునీరు అందించేందుకు హంద్రీ-నీవా కాలువ విస్తరణ పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మండలంలోని దేవప్పకోట పంచాయతీ సమీపంలోని దొరిగుండ్లపల్లెకు సమీపంలో కాలువ విస్తరణ పనులకు గురువారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ భూమి పూజ చేయగా తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నాయకుడు దాసరిపల్లె జయచంద్రారెడ్డి, ఎస్ఈ సీఆర్ రాజగోపాల్, మదనపల్లె సర్కిల్-3 అధికారి ప్రసాద్‌రెడ్డి, హంద్రీ-నీవా ఏఈ దేవపట్ల ఆంజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రభుత్వం హంద్రీ-నీవా కాలువల విస్తరణ కోసం ప్రభుత్వం రూ.348 కోట్ల నిధులను విడుదల చేసిందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే హంద్రీ-నీవా కాలువలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించి నిధులు విడుదల చేసిందని తెలిపారు. ఇటీవల జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తంబళ్లపల్లె నియోజకవర్గ పర్యటనకు వచ్చిన సందర్భంగా హంద్రీ-నీవా కాలువల స్థితిగతులను ఆయన దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఆయన వెంటనే నిధులను విడుదల చేయడంతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. పెద్దతిప్పసముద్రం మండల సరిహద్దు గుడ్డంపల్లె నుంచి పీటీఎం, బి.కొత్తకోట, గట్టు, కురబలకోట, మదనపల్లె, పుంగనూరు మీదుగా పెద్దపంజాణి మండలం అప్పినపల్లె వరకు ఉన్న సుమారు 225.35 కిలోమీటర్ల వరకు ఉన్న హంద్రీ-నీవా కాలువను విస్తరించనున్నట్లు ఆయన తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి రైతులకు కాలువల ద్వారా నీరు అందించాలని హంద్రీ-నీవా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జనసేన తంబళ్లపల్లె ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్, తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సీడ్ మల్లికార్జున నాయుడు, దేవప్పకోట టీడీపీ సర్పంచ్ అనితాసురేష్, టీడీపీ నాయకులు కట్టా సురేంద్ర నాయుడు, పులికల్లు మాజీ సర్పంచ్ కట్టా వెంకట్రమణనాయుడు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి తులసీధర్ నాయుడు, మాజీ సర్పంచ్ ఎర్రగుడి సురేష్, తదితరులు పాల్గొన్నారు.



దేవప్పకోట సమీపంలో హంద్రీ-నీవా కాలువ విస్తరణ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, చిత్రంలో జయచంద్రారెడ్డి

ఇలా వచ్చి.. అలా వెళుతున్నారు

- బదిలీల పేరుతో విధులకు డుమ్మా
- 15 రోజులుగా ఇదే తంతు
- ఇదీ రాయచోటి మున్సిపాలిటీలో ఉద్యోగుల తీరు


రాయచోటి మున్సిపల్ కార్యాలయం

రాయచోటి (కలెక్టరేట్) సెప్టెంబరు 26: రాయచోటి మున్సిపాలిటీలో పని చేస్తున్న కొందరు ఉద్యోగులు 15 రోజులుగా విధులకు ఇలా వచ్చి అలా వెళ్లిపోతున్నారని తెలిసింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక గత నెల 18 నుంచి బదిలీలకు పచ్చజెండా ఊపింది. అయితే విజయవాడలో ఫ్లడ్స్ (వరదలు)వచ్చిన కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బందిని విజయవాడకు పంపడంలో భాగంగా రాయచోటి మున్సిపల్ కమిషనర్ కొందరిని అక్కడికి పంపారు. ఇదే అదునుగా మిగిలిన కొందరు ఉద్యోగులు కనీస బాధ్యత మరచి విధులకు డుమ్మాకొడుతూ ఇతరపనుల్లో బిజీగా వున్నారని తెలిసింది. ఈనెల 15వ తేదీకి బదిలీల ప్రక్రియ ముగియాల్సి ఉంది. ఇదిలా వుండగా బదిలీల విషయంలో ప్రభుత్వం ఈ నెల ఆఖరు వరకు అవకాశం ఇస్తూ జీఓను విడుదల చేసింది. దీంతో ఉద్యోగులు ఇష్టానుసారం వ్యవహరిస్తూ విధులకు ఎగనామం పెడుతున్నారని తెలిసింది.

విజయవాడ ఘటనపై కమిషనర్ అక్కడకు వెళ్లినప్పుడు మున్సిపల్ ఉద్యోగులు కాలక్షేపం కోసం అలా వచ్చి కాసేపు ఫేస్‌బుక్‌లు చూసుకుని వెళ్లేవారని కింది స్థాయి సిబ్బంది చెప్పుకొస్తున్నారు. రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, పరిపాలన విభాగంలో పనిచేసే ఉద్యోగులు బదిలీల పేరుతో అసలు ఆఫీసుకు రావడం మరచిపోయారని వాదన బలంగా వినపడుతోంది. దీంతో ఇంటి పన్నులు, టౌన్ ప్లానింగ్ అనుమతులు తదితర పనులు నిమిత్తం వచ్చేవారు రోజుల తరబడి కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారని తెలిసింది. స్పెషల్ అప్ గ్రేడ్ మున్సిపాలిటీ అయినప్పటి నుంచి ఏదైనా పని నిమిత్తం వచ్చే వారికి సచివాలయానికి వెళ్లండంటూ ఉచిత సలహాలు ఇస్తూ తమకేమి సంబంధం లేదన్నట్లు ఉద్యోగులు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇక ఉద్యోగులకు బదిలీలు వచ్చినా.. రిలీవర్ వచ్చేంత వరకూ ప్రజలకు సేవలు అందించాల్సి వుంటుంది. ఇక్కడ అలాంటి నిబంధనలు ఏవీ పాటించకుండా ఎప్పుడు పడితే విధులకు రావడం, నచ్చినప్పుడు వచ్చి సీట్లో కూర్చోవడం.. లేదా ఏదోక కుంటిసాకుతో ఆఫీసు వదలి వెళ్లడం.. నిరంతరం జరిగే ప్రక్రియ అని చెప్పవచ్చు. కమిషనర్ ఈ రోజు డ్యూటీకి రాడని తెలిస్తే చాలు ఉద్యోగులు కార్యాలయం వైపు కన్నెత్తి కూడా చూడరనే ఆరోపణలు బలంగా వున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు రాయచోటి మున్సిపాలిటీ ఉద్యోగుల ఆగడాలకు కళ్లెం వేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మున్సిపల్ అధికారులపై విమర్శలు వున్నాయి

రాయచోటి మున్సిపల్ ఉద్యోగులపై చాలా విమర్శలు వున్నాయి. సచివాలయాలు వచ్చాక వీరు బద్ధకస్థులుగా మారారని.. ఆరోపణలు ఉన్నాయి. వీరిలో కొందరు అధికారులు సచివాలయ సిబ్బంది ద్వారా మామూళ్లు తీసుకుంటూ ఏదైనా సమస్య వచ్చినప్పుడు తమకు తెలియనట్లు నటిస్తూ.. కమిషనర్ వద్ద నిజాయితీ పరులుగా ఫోజులు ఇస్తుంటారని కిందిస్థాయి సిబ్బంది చెబుతున్నారు. జిల్లా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో వీరు ఇలా తయారయ్యారనే వాదన వుంది.

-సిద్ధిగాళ్ల శ్రీనివాసులు,
సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి, అన్నమయ్య జిల్లా

చర్యలు తీసుకుంటాం..

నేను విజయవాడకు వెళ్లినప్పుడు ఇక్కడ ఎమి జరుగుతోందనే విషయం నాకు తెలియదు. విధులకు ఎవరు సక్రమంగా రావడం లేదో విచారిస్తాను. ఇంకోసారి ఇలా జరగకుండా చర్యలు కఠినంగా తీసుకుంటాం.

-వాసుబాబు,
మున్సిపల్ కమిషనర్, రాయచోటి

పశువైద్య కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం


పశువైద్య కళాశాలలో విద్యార్థికి అడ్మిషన్ ఇస్తున్న ప్రిన్సిపాల్

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 26: గోపవరంలోని శ్రీవెంకటేశ్వర పశువైద్య కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు గురువారం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఎంపికైన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్ అడ్మిషన్లు ఇచ్చారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు అడ్మిషన్లు జరుగుతాయని, ఆన్‌లైన్ ద్వారా 60 మంది విద్యార్థులకు మొదటి సంవత్సరంలో చేరడానికి అవకాశం కలిగిందన్నారు. వారిలో 15 మంది వీసీఐ కోటా ద్వారా ఎంపికయ్యారని తెలిపారు. 28వ తేదీ విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం ఉంటుందని, 30వ తేదీ నుంచి మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల వైద్యులు పాల్గొన్నారు.

పెన్నాకు కొనసాగుతున్న నీటి విడుదల

మైలవరం, సెప్టెంబరు 26: మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటి విడుదల కొనసాగుతోంది. గురువారం జలాశయం నుంచి 4500 క్యూసెక్కుల నీటిని పెన్నానదికి వదులుతుండగా... గండికోట జలాశయం నుంచి 5వేల క్యూసెక్కుల నీరు మైలవరానికి చేరుతోంది. ఉత్తరకాల్వకు 50 క్యూసెక్కులు, దక్షిణ కాల్వకు 200 క్యూసె క్కుల నీటిని వదులుతున్నామని జలాశయ ఏఈఈ గౌతమ్‌రెడ్డి తెలిపారు. గండికోట జలాశయం నుంచి మైలవరానికి ఇన్‌ఫ్లో మరింత పెరిగితే పెన్నానదికి వదులుతామని.. పరివాహకప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మైలవరం జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.7 టీఎంసీలు నిల్వ ఉంది.

29న కడపలో రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్

కడప (స్పోర్ట్స్) సెప్టెంబర్ 26: కడప నగర పరిధిలో గల (దండు- ఆలంఖాన్‌పల్లె) విస్డమ్ స్కూల్‌లో ఈనెల 29వ తేదీ ఆదివారం రాష్ట్ర స్థాయి ఓపెన్ ప్రైజ్‌మనీ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్ దర్బారీ తెలిపారు. ఇందులో విజేతగా నిలిచిన క్రీడాకారుడికి రూ.30 వేలు నగదు బహుమతితో పాటు ట్రోఫీలు, మెడల్స్ కూడా ఇస్తారన్నారు. టోర్నమెంట్‌కు చీఫ్ ఆర్బిటర్‌గా ప్రముఖ ఎఫ్ఐడీఈ ఆర్బిటర్ ఎం.గోపీనాథ్ (గుంటూరు), డిప్యూటీ ఆర్బిటర్‌గా సీనియర్ నేషనల్ ఆర్బిటర్ రామ్, వంశీ (నెల్లూరు) విధులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వీరితో పాటు ముఖ్య అతిథులుగా ఏపీ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.సత్యనారాయణరావు, కార్యదర్శి వై.సుమన్ హాజరుకానున్నట్లు తెలిపారు. టోర్నమెంట్‌లో క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇతర వివరాలకు 8341255151 అనే నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అక్టోబరు 4న స్కిల్ కోచ్ పరీక్ష

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 26 : వైవీయూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ కోర్సులు రెండో సెమిస్టరు చదువుతున్న విద్యార్థులకు అక్టోబరు 4న స్కిల్ కోర్సు పరీక్ష నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2గంటలకు ఉం టుందని.. ఈ సమాచారం అన్ని కళాశాలల నోటీసు బోర్డులో ప్రదర్శించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


సయ్యద్ అహందుల్లయ్య (ఫైల్‌ఫొటో)

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 26: మైదుకూరు బైపాస్ రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సయ్యద్ అహందుల్లయ్య (39) అక్కడిక్కడే మృతి చెందాడు. వివరాల్లోకెళితే... తెలంగాణ రాష్ట్రం బాన్సువాడ మండలం వాసి అహందుల్లయ్య బైక్‌లో కడప వైపు ప్రయాణిస్తుండగా మైదుకూరు బైపాస్ వద్ద అదుపు తప్పి రోడ్డు రోలర్‌ను ఢీకొన్నాడు. దీంతో తలకు బలమైన గాయం కావడంతోనే అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి.. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ప్రొద్దు టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో నవ వరుడు దుర్మరణం



పుల్లంపేట, సెప్టెంబరు 26: పుల్లంపేట మెయిన్‌రోడ్డులో నివాసం ఉంటున్న దినేష్(28) బుధవారం విజయవాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. గతనెల 15న దినేష్ విజయవాడకు చెందిన యువతి జోష్ణవితో పుల్లంపేటలో వివాహమైంది. రెండు రోజుల క్రితం దినేష్ తన భార్యతో కలిసి అత్తగారి ఇల్లు అయిన విజయవాడకు వెళ్లాడు. బుధవారం రాత్రి ఇంటి నుంచి మోటారుబైకులో బయలుదేరిన దినేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పెళ్లికుమార్తె కాళ్లపారాణి ఆరకముందే వివాహమైన నెలన్నరకే దినేష్ మృతిచెందడంతో రెండు కుటుంబాల్లో విషాదఛాయలు అలముకున్నాయి.

నన్నారి ఫ్యాక్టరీలో చోరీ

పులివెందుల టౌన్, సెప్టెంబరు 26: పులివెందుల పట్టణంలోని పార్నపల్లె రోడ్డులో గంగిరెడ్డి ఫ్యాక్టరీలో బాషా అనే వ్యక్తి నన్నారి ఫ్యాక్టరీ నడుపుతున్నాడు, గురువారం ఫ్యాక్టరీలో దొంగలు పడి 8 సిలిండర్లు, వెల్డింగు మిషన్‌తో పాటు మూడు మోటర్లను దొంగలించినట్లు బాధితుడు బాషా తెలిపారు. వీటి విలువ సుమారు రూ.13 లక్షలు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశారు. పట్టణంలో వరుస చోరీలు జరుగుతుండడంతో పులివెందుల పట్టణ ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన పడుతున్నారు. పోలీసు అధికారులు చోరీలను అరికట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

గుర్తు తెలియని శవం



ఓబులవారిపల్లె, సెప్టెంబరు 26: మండల పరిధిలోని కొర్లకుంట పరిసరాల్లో గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. కొర్లకుంట గ్రామం నుంచి సుమారు కిలోమీటరు దూరంలోని రైల్వేబ్రిడ్జి దగ్గర గుర్తు తెలియని మగ శవం పడి ఉంది. ఆచూకీ తెలిసినవారు సమాచారం ఇవ్వాలన్నారు. 9121100580 నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలపాలన్నారు.

సమాజ అవసరాలు తీర్చేలా విద్యావిధానం : వీసీ


మాట్లాడుతున్న రిజిస్ట్రారు ప్రొఫెసరు రఘునాథరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 26: సమాజ అవసరాలు తీర్చేలా విద్యార్థుల్లో నైపుణ్యత పెంచే దిశగా విద్యాలయాలు ప్రయత్నాలు ప్రారంభించాలని వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి తెలిపారు. గురువారం యూనివర్శిటీ అన్నమాచార్య సెనెట్‌హాలులో ఉన్నత విద్య ప్రయోజనాలు వ్యూహాలు, సవాళ్లు, నైపుణ్యత ఆధారిత పాఠ్యాంశాలు అనే అంశంపై రెండురోజుల జాతీయ వర్క్‌షాపును రిజిస్ట్రారు రఘునాధరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ ఉన్నత విద్యలో మార్కులు ప్రామాణికం కాదని, నైపుణ్యత ముఖ్యమన్నారు. జాతీయ విద్యావిధానం ద్వారా ప్రయోగాత్మక విద్యాబోధన అమల్లోకి రానుందని.. నాలుగేళ్ల హానర్స్ కోర్సు సత్ఫలితాలు ఇస్తుందన్నారు.

రిజిస్ట్రార్ ప్రొఫెసరు రఘునాధరెడ్డి మాట్లాడుతూ భారతదేశం ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిష్కృతమైనా నైపుణ్యత లేని యువత వల్ల దేశ ఆర్థికాభివృద్ధికి ఆటంకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో 47శాతం మంది విద్యార్థులు మాత్రం సరైన నైపుణ్యత కలిగి ఉన్నారన్నారు. భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎంఎపీ 2020 విద్యారంగంలో ఒక మైలురాయి అని తెలిపారు. ఈ విధానం ఎన్నో విప్లవాత్మక మార్పులు తెస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం తిరుపతి ఐఐటీ ప్రొఫెసరు సునీల్‌కుమార్, వెల్లూరు వీఐటి ప్రొఫెసరు ఎస్ఎం ఫరూక్, కన్వీనర్లు ప్రొఫెసరు లలితలు ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రొఫెసరు సరిత, అసోసియేట్ ప్రొఫెసరు సునీతతో పాటు పలువురు పాల్గొన్నారు.

200ఎకరాలకు పైబడి దెబ్బతిన్న ఉల్లి, పత్తిపంటలు


కొమ్మద్ది గ్రామంలో తడిచిపోయిన ఉల్లిగడ్డలు

వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 26: ఆరుగాలం శ్రమించి సాగుచేసిన ఉల్లి, పత్తి పంటలు వర్షం పాలయ్యాయి. వీరపునాయునిపల్లె మండలంలోని కొమ్మద్ది గ్రామంలో బోరుబావుల కింద దాదాపు 200 ఎకరాల్లో సాగుచేసిన ఉల్లి, పత్తి పంటలు వర్షంతో దెబ్బతిన్నాయి. బుధవారం రాత్రి మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో గ్రామానికి చెందిన దాదాపు 50 మంది రైతులు సాగు చేసిన సుమారు 200 ఎకరాలకు పైబడి ఉల్లి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. ఉల్లి సాగు చేసేందుకు ఎకరాకు రూ.70వేల నుంచి రూ.80వేల వరకు ఖర్చు అయ్యిందని, ఉల్లిగడ్డలు కూలీలతో పీకించి పొలం మీదనే ఆరబెట్టామని.. అంతలోపే వర్షం కురవడంతో పంట అంతా దెబ్బతిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిన్న పంటలను జిల్లా అధికారులు పరిశీలించి తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ పూజారి మృతి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 26: దత్తాత్రేయ స్వామి ఆలయం ప్రధాన పూజారి వీణా రామానుజాచార్యులు (58) చికిత్స పొందు తూ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. గత శుక్రవారం ఆయన విషద్రావణం తాగి ఆత్మహత్యకు యత్నించారు. కుటుంబీ కులు చికిత్స కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. చికిత్స తర్వాత ఇంటికి తీసుకొచ్చారు. గురువారం తెల్లవారుజామున పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆలయ ఈఓ వేధింపులతోనే ఆత్మహత్యకు పాల్పడ్డారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఆయన భార్య తీర్థపాటి పుష్ప ఈఓ సక్రమంగా జీతాలు ఇవ్వడంలేదని, తాము ఉంటున్న ఇంటికి బాడుగ వసూలు చేస్తుండడంతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇరిగేషన్‌లో ఈఈల బదిలీలు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 26: కడప జీఎన్ఎస్ఎస్ ఈఈగా సుబ్రమణ్యం మంజుల బదిలీపై వచ్చారు. కడప ఇరిగేషన్ ఈఈగా పనిచేస్తున్న శేషుబాబు బద్వేలు తెలుగు గంగ ప్రాజెక్టు ఈఈగా బదిలీ అయ్యారు. అలాగే కడప ఇరిగేషన్ ఈఈగా మధుప్రసాద్‌రెడ్డి సుబ్రమణ్యం బదిలీపై వచ్చారు.

కడప కార్పొరేషన్ కమిషనర్‌గా మనోజ్‌రెడ్డి



కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 26: కడప మునిసిపల్ కార్పొ రేషన్ కమిషనర్‌గా నిమ్మనపల్లె మనోజ్‌రెడ్డిని నియమిస్తూ గురు వారం ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసా ద్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం మున్సిపల్ కమి షనర్‌గా ఉన్న వైఓ నందన్ చీఫ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. ఎన్.మనోజ్‌రెడ్డి పలమనేరు ఆర్డీవోగా ఉన్నారు. గురువారం చేపట్టిన బదిలీల్లో భాగంగా ఈయనను జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. తిరిగి కొన్ని గంటల వ్యవధిలోనే కడప మున్సిపల్ కార్పొ రేషన్ కమిషనర్‌గా నియమించారు. ఈయన 2022 బ్యాచ్‌కు చెందిన గ్రూప్-1 అధికారి. గత ఏడాది నవంబర్‌లో పలమనేరు ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం కడప కమిషనర్‌గా వస్తున్నారు.

బాలగొండ గంగాధర్‌కు పర్యాటక ఎక్సలెన్స్‌అవార్డు



కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 26 : కడప నగరానికి చెందిన చరిత్ర అధ్యాపకుడు బాలగొండ గంగాధర్‌కు 2024కు సంవత్సరానికి రాష్ట్ర పర్యాటకశాఖ ఎక్సలెన్స్ అవార్డు ప్రకటించింది. పర్యాటకంపై రాష్ట్రస్థాయిలో ప్రస్తుత స్థితిగతు లు, ఆర్థిక సామాజిక ప్రభావం తదితర అంశాలపై ఆయన జాతీయస్థాయిలో ప్రచురించిన పత్రాలు పుస్తకాలకు ఈ బహుమతి లభించింది. గంగాధర్ జిల్లా పర్యాటక సంస్థలకు సుపరిచితుడు. సుబ్బిరెడ్డి డిగ్రీకళాశాలలో చరిత్ర అధ్యాపకుడుగా, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కూడా అధ్యాపకులుగా సేవలందించారు. గంగాధర్ ప్రస్తుతం వేంపల్లె డిగ్రీకళాశాలలో చరిత్ర అధ్యాపకుడుగా పనిచేస్తున్నాడు.

జాతీయస్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థినులు



అట్లూరు, సెప్టెంబరు 26: అట్లూరు కేజీబీవీ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక య్యారు. 23న తిరు పతిలో జరిగిన జూడో జాతీయ స్థాయి టోర్న మెంటులో యక్ష రెండో స్థానం దక్కించుకుందని కేజీబీవీ ప్రత్యేక అధికారి ఫణిశ్రీ తెలిపారు. ఇటీవల కడపలో జరిగిన జిల్లాస్థాయి కుస్తీ పోటీలకు అండర్-14 విభాగంలో గోపిక, తనూజా, కీర్తన, హిమ, శైలజ విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ ప్రమీల తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సుండుపల్లె విద్యార్థులు



సుండుపల్లె, సెప్టెంబరు 26: సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గురువారం కడప జిల్లాలోని గండి గురుకుల పాఠశాలలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ అండర్-14, అండర్-17 బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల కోసం ఉమ్మడి కడప జిల్లా జట్టు ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికల్లో సుండుపల్లె ఉన్నత పాఠశాల నుంచి అండర్-17 బాలికల విభాగం ఎం.వాణి, అండర్-14 విభాగంలో సి.గగన, అర్పిష, ఆఫీఫా, నవ్యలతలు ప్రతిభ చాటడంతో ఉమ్మడి కడప జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు ఫిజికల్ డైరెక్టర్ రాధారాణి తెలిపారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు మహదేవపల్లె విద్యార్థిని

చక్రాయపేట, సెప్టెంబరు 26: ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ అండర్-14 రాష్ట్ర స్థాయి పోటీలకు మహదేవపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మేకల బిందు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రవికుమార్, పిడి ఓబులేసు తెలిపారు. ఎంపికైన విద్యార్థిని బిందును, పిడిలను విద్యావేత్త వెంకటప్రసాద్, గ్రామ టీడీపీఇన్‌చార్జిరమేష్‌లు అభినందించారు.

శిశువు మృతి కేసులో ఇద్దరికి జైలు శిక్ష

వేంపల్లె, సెప్టెంబరు 26: మండలంలోని పాములూరు గుట్ట ప్రాంతంలో గుర్తుతెలియని మూడు రోజుల శిశువు మృతి కేసులో ఇద్దరికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చినట్లు సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. 2016లో జరిగిన ఈ ఘటనపై వీఆర్వో సునీల్ ఫిర్యాదు మేరకు పులివెందులకు చెందిన బత్తిన మల్లీశ్వరి, బత్తుల చిన్నపై ఎస్ఐ మదుమల్లేశ్వర రెడ్డి కేసు నమోదు చేసి విచారణ జరిపారు. గురువారం నిందితులు మల్లీశ్వరికి ఏడాది జైలు, రూ.1000 జరిమానా, చిన్నకు మూడేళ్ల జైలు, రూ.1500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

ఖజానాకు కన్నం..!



- రాజంపేట సబ్ ట్రెజరీ స్ట్రాంగ్ రూములో చోరీ
- రూ.11,500 నగదు, 20 తులాల బంగారు మాయం?
- ఇంత వరకు కేసు నమోదు కాని వైనం

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 26: ఇళ్లకు దొంగలు కన్నాలు వేయడం చూశాము. బ్యాంకులు చివరికి ఏటీఎంలకు కన్నాలు వేసే ఘటనలు చూస్తుంటాం. 24 గంటల పోలీసు భద్రత నడుమ ఉండే ఖజానా శాఖ స్ట్రాంగ్ రూములకు కన్నాలు వేసే దొంగల బాగోతం తాజాగా ఉమ్మడి కడప జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. పకడ్బందీగా, కట్టుదిట్టమైన భద్రతా వలయంలో ఉండే ఖజానా స్ట్రాంగ్ రూములో చోరీ జరగడం అసాధ్యమే. అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ తాజాగా అన్నమయ్య జిల్లా ఖజానా శాఖ పరిధిలోని రాజంపేట సబ్ డివిజన్ ట్రెజరీ స్ట్రాంగ్ రూములో రూ.11.500 నగదు, 20 తులాల బంగారు మాయం అయినట్లు ఆ శాఖ ఉద్యోగుల్లో చర్చ సాగుతోంది. ఈ చోరీ జరిగి వారం రోజులు కావస్తున్నా సంబంధిత ఉన్నతాధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వకపోవడం చూస్తే కంచే చేను మేసిందా? అనే సందేహాలు ఆశాఖ ఉద్యోగుల్లో వ్యక్త మవుతున్నాయి. వివరాలిలా..

రాజంపేట సబ్ డివిజన్ కార్యాలయంలో ఒక సబ్ ట్రెజరీ అధికారితో పాటు ఇద్దరు అటెండర్లు, 8 మంది సీనియర్ అసిస్టెంట్లు, 1 షరాబు పనిచేస్తున్నారు. ఏదైనా ఎలక్షన్ డబ్బు కానీ, వెండి బంగారు, ఖరీదైన వస్తువులు అధికారుల తనిఖీల్లో పట్టుబడితే ఖజానా శాఖ పరిధిలోని స్ట్రాంగ్ రూములో భద్రపరుస్తారు. ఆ సొమ్ముకు సంబంధించి బిల్లులు, ఇతర ఆధారాలు చూపితే తిరిగి చెల్లించేందుకు వీలుంటుంది. అన్ని ఆధారాలు పరిశీంచిన మీదటే చివరికి సబ్‌ట్రెజరీ అధికారి, అసిస్టెంట్ అధికారి సంతకాలతో కూడిన పత్రాలుండాలి. గేట్ ఎంట్రీ పాస్, బుక్‌లో నమోదు, లోపలికి ఎంతమంది వెళ్లారు? మళ్లీ బయటకు వచ్చారా? లేదా అనే విషయాలపై పూర్తి పోలీసు నిఘా ఉంటుంది. ఇంత జరిగితే కానీ స్ట్రాంగ్ రూములోని వస్తువు బయటకు రాదు. రాజంపేట సబ్ ట్రెజరీ స్ట్రాంగ్ రూములో రూ.11,500 నగదు, దాదాపు 20 తులాల బంగారు ఐరన్ బాక్సులో పెట్టి భద్రపరిచి సీల్ వేశారు. వీటికి సంబంధించి తగిన ఆధారాలు ఉండడంతో నగదు రికవరీ కోసం పోలీసు వచ్చాడు. నగదు, నగలు అక్కడ లేకపోవడంతో ఆయన అవాక్కయ్యారు. అయితే ఈ విషయాన్ని అధికారులు బయటకు పొక్కనివ్వలేదు. రికవరీ సొమ్ము మాయం కావడంతో ఎక్కడ ఇబ్బందులు వస్తాయో అని ఆ సబ్ ట్రెజరీ అధికారి మొయినుద్దీన్ తన సొంత డబ్బులతో సర్దుబాటు చేసినట్లు ఆ శాఖలో ప్రచారం సాగుతోంది. సీల్డ్ బాక్సులో భద్రపరిచిన నగదు, బంగారు మాత్రమే చోరీకి గురయ్యాయా.. లేక ఇంకేమైనా సొమ్ము లు పోయాయా? అనే విషయాలు తెలియలేదు. ప్రభుత్వ ఖజానా స్ట్రాంగ్ రూముకే కన్నంవేసిన ఉద్యోగులను ఆ అధికారి కాపాడడడంలో అంతర్యం ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నమౌతున్నాయి. ఈ విషయమై ఉమ్మడి కడప జిల్లా డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర రావును వివరణ కోరగా అది తన పరిధి కాదని, అన్నమయ్య జిల్లా డీటీఏఓను సంప్రదించాలని సూచించారు. అన్నమయ్య జిల్లా ఖజానాశాఖ సహాయ సంచాలకులు మహబూబ్ బాషాను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

ఇరువర్గాల ఘర్షణ- ఇద్దరికి గాయాలు


గాయపడ్డ భయ్యారెడ్డి

చిన్నమండెం, సెప్టెంబరు 26: మండలంలోని మల్లూరు గ్రామ పంచాయతీ బెల్లంవాండ్లపల్లిలో భూమి విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి ఇద్దరికి తలకు రక్త గాయాలయ్యాయి. బాధితుడు భయ్యారెడ్డి మాట్లాడుతూ సర్వేనెంబర్ 543లో తమకు పట్టా భూమి ఉందన్నారు. కాగా సర్వేయర్ ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా సర్వే చేపట్టడంతో పక్క ఉన్న భూముల వారికి తమకు ఘర్షణ జరిగిందని తెలిపారు. ఈ ఘర్షణలో సర్వేయర్ చేతిలో ఉన్న కర్రతో రంగారెడ్డి, అశోక్ రెడ్డి, అన్నారెడ్డి వారి కుమారులు తమపై కట్టెలు, రాళ్లతో దాడి చేశారని, ఈ దాడిలో తనతో పాటు తమ పెదనాన్న కృష్ణారెడ్డి తలకు తీవ్రమైన గాయాలై హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఇదే విషయమై ఎస్‌ఐ సుధాకర్‌ను వివరణ కోరగా తమకు ఇంకా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

హమాలీలకు కూలిరేట్లు పెంచాలి

● రెండవ రోజు సివిల్ సప్లై పాయింట్ వద్ద నిరసన

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 26: సివిల్ సప్లై హమాలీలకు కూలిరేట్లు పెంచాలని హమాలీలు డిమాండ్ చేశారు. గురువారం మాసాపేటలో వుండే స్టాక్ పాయింట్ వద్ద రెండవ రోజు నిరసన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం హమాలీల విషయంలో నిర్లక్ష్యం వీడి జీతాలు సకాలంలో అందించాలని సివిల్ సప్లై హమాలీలు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కృష్ణయ్య, సంపత్‌కుమార్, రాంప్రసాద్, చిన్నప్ప, అంజనేయులు, రామక్రిష్ణ, నర్సింహులు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు క్వార్టర్స్ స్థలం పరిశీలన

రామాపురం, సెప్టెంబరు 26: మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయం సమీపంలో పోలీస్ క్వార్టర్స్‌కు సంబంధించిన స్థలాన్ని గురువారం ఎస్‌ఐ వెంకటసుధాకర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నల్లగుట్టపల్లి గ్రామం పొలం సర్వే నెంబరు 593/1లో 0.64 సెంట్ల స్థలాన్ని పరిశీలించామన్నారు. పోలీసులకు కేటాయించిన స్థలంలో కొందరు ఇటీవల ఆక్రమణకు గురి చేస్తున్నారని తెలిసి తమకు కేటాయించిన స్థలంలో పెరిగిన కంపచెట్లు, పిచ్చిమొక్కలు తొలగించి హద్దులను ఏర్పాటు చేసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే ఆ స్థలంలో పోలీసు క్వార్టర్స్‌ను నిర్మించుకుంటామని ఆయన తెలిపారు.

ఏపీ మోడల్ స్కూల్‌లో స్వచ్ఛతాహి సేవ

రాయచోటిటౌన్, సెప్టెంబరు 26: రాయచోటి మండల పరిధిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో గురువారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రేఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల పాఠశాల ఆవరణంలో కంపచెట్లను, పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో గైడ్స్ మాస్టర్ ముజీనాబీన్‌ఖానం, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రసన్నకుమార్, విద్యాకమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరోగ్య దినోత్సవ వేడుకలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 26: ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రాయచోటి పట్టణంలోని మాసాపేట హైస్కూల్ రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు చెట్ల ప్రాముఖ్యతపై పిల్లలకు అవగాహన కల్పించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

వీరబల్లి, సెప్టెంబరు 26: రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే సీఎం చంద్రబాబు లక్ష్యమని మండల టీడీపీ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు అన్నారు. పలు గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓదివీడు కస్పా, గుర్రప్పగారిపల్లె పంచాయతీ బెజవాడ హరిజనవాడ, ఎగువ, దిగువ, కోనేటివాండ్లపల్లి గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 26: మండల పరిధిలోని మంగంపేట అగ్రహారం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. మంగంపేటకు చెందిన కృష్ణయ్య ద్విచక్రవాహనంలో వెళ్తుండగా లారీ ఎదురుగా వచ్చి ఢీకొనడంతో కాలు విరిగి తీవ్రగాయాలయ్యాయి. కాగా ఎమ్మెల్యే శ్రీధర్ ఘటనా స్థలికి చేరుకొని బాధితుడిని పరామర్శించారు. వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

భూకబ్జాదారుల ఆటలు సాగనివ్వం

● నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం


మాట్లాడుతున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

రాజంపేట, సెప్టెంబరు 26: కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు పరిపాలనలో పారదర్శకతకు తప్ప అక్రమ భూకబ్జాదారుల ఆటలు సాగనివ్వబోమని రాజంపేట నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు సుగవాసి బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. గురువారం సిద్దవటం మండలం ఉప్పరపల్లె గ్రామంలో జరిగిన మన మంచి ప్రభుత్వం ప్రజాదర్బార్ గ్రామసభకు సుగవాసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ముందు కొందరు దొంగచాటున భూకబ్జాదారులు టీడీపీలోకి ప్రవేశించి భూకబ్జాలకు పాల్పడాలని చూస్తున్నారని, తాను చేసినా ఇతరులు చేసినా దీన్ని ప్రభుత్వం క్షమించబోదన్నారు. అలాగే ఉప్పరపల్లె గ్రామంలో వారం రోజుల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అభివృద్ధి సంక్షేమం పరుగులు తీస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం మండల టీడీపీ సీనియర్ నాయకులు, ఉప్పరపల్లె గ్రామ నేత పుత్తా బాబు, పుత్తా శివ, పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి వెంకటసుబ్బయ్య, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు రామచంద్రయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు అమర్‌నాథ్‌శర్మ, జిల్లా టీడీపీ కార్యదర్శి నాగమునిరెడ్డి, పార్లమెంట్ లీగల్‌సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, రాజంపేట మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి మారుపేరు చంద్రబాబు

● ఎమ్మెల్యే అరవ శ్రీధర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్

రైల్వేకోడూరు(రూరల్), సెప్టెంబరు 24: సంక్షేమానికి మారుపేరు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. పట్టణంలోని రాజ్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతూ రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక సమస్యలున్నా ప్రభుత్వం ఉద్యోగులకు, వృద్ధులకు ప్రతి నెల మొదటి తేదిన జీతాలు, పింఛన్ ఇస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందని కొనియాడారు. అనంతరం ప్రజలు ఇచ్చిన వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చక్రంపేట విద్యార్థుల ప్రతిభ

పెనగలూరు, సెప్టెంబరు 26: రైల్వేకోడూరు నియోజకవర్గ స్థాయిలో ఈ నెల 25న జరిగిన జోనల్‌గేమ్స్ అథ్లెటిక్స్ పోటీల్లో చక్రంపేట విద్యార్థులు ప్రతిభ కనబరచి ఈ నెల 28న కడపలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు ఆ పాఠశాల హెడ్మాస్టర్ లేబాకు గోపాలకృష్ణ తెలిపారు. జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులకు గురువారం పాఠశాల ప్రాంగణంలో మెమెంటోలు అందజేసి ఘనంగా అభినందించారు. ఉపాధ్యాయులు అన్వర్‌బాషా, కృష్ణకుమారి, పరిమిళ, ప్రమీల, మహేంద్ర, సుదర్శన్, శివనరసింహులు, ప్రసాద్, లక్ష్మీదేవి, వెంకటరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

చిట్వేలి, సెప్టెంబరు 26: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 8 మంది జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తమరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో చదువుతో పాటు వారిలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మండల నియోజకవర్గం, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. గత 23, 24, 25 తేదీల్లో చెన్నరాజుపోడు ముక్కావారిపల్లె, రైల్వేకోడూరు ఉన్నత పాఠశాలల్లో నియోజకవర్గస్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో చిట్వేలి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి 8 మంది జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. వీరిని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, పాఠశాల కమిటీ చైర్మన్లు అభినందించారు.

అట్టహాసంగా అండర్-19 క్రీడా పోటీలు

పుల్లంపేట, సెప్టెంబరు 26: పుల్లంపేటలోని ఆదర్శ పాఠశాలలో గురువారం జిల్లాస్థాయి అండర్-19 క్రీడా పోటీల్లో అట్టహాసంగా జరిగాయి. క్రికెట్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ క్రీడల్లో నిర్వహించిన సెలక్షన్లలో సుమారు 200 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో చక్రధర్‌రాజు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సమానమని, విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ లీలాశ్రీహరి, ఎస్‌జీఎఫ్ అండర్-19 శారదా, అథ్లెటిక్స్ సెక్రటరి విజయప్రసాద్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు చంద్రమోహన్‌రాజు, అరుణ, నీలకంఠరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌కు రూ.10 వేలు విరాళం

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 26: రాష్ట్రంలో పేదల ఆకలి తీర్చేందుకు ప్రవేశపెట్టిన అన్నాక్యాంటీన్‌కు లక్కిరెడ్డిపల్లె ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి రూ.10 వేలు విరాళం అందజేశారు. ఈ మేరకు గురువారం అనంతపురం ఈడిగపల్లెలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో మండిపల్లె లక్ష్మీప్రసాదురెడ్డి చేతికి చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి చైర్మన్ యనమల విశ్వనాథ, ఉపాధ్యాయులు నిత్యపూజయ్య పాల్గొన్నారు.

చెత్త తొలగింపు

చిన్నమండెం, సెప్టెంబరు 26: మండలంలోని దేవగుడిపల్లి గ్రామ పంచాయతీ బాపూజీనగర్ కాలనీలో స్వచ్ఛతాహి కార్యక్రమంలో భాగంగా మురికినీటి కాలువలో చెత్తను తొలగించారు. ఎక్సకవేటర్ సహాయంతో సర్పంచ్ అమృతమ్మ, పంచాయతీ సెక్రటరీ సుమిత్రమ్మల ఆధ్వర్యంలో తొలగించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే అనారోగ్యానికి గురికాకుండా ఉంటారని ప్రజలకు అధికారులు వివరించారు.

పుల్లంపేట సబ్‌రిజిస్ట్రార్ బదిలీ

పుల్లంపేట, సెప్టెంబరు 26: పుల్లంపేట సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న మహ్మద్ అజీజ్ జమ్మలమడుగుకు బదిలీ అయ్యారు. అలాగే సీనియర్ అసిస్టెంట్ సుబ్బనరసయ్య, జూనియర్ అసిస్టెంట్ మస్తాన్, అటెండర్ అల్తాఫ్ పలుచోట్లకు బదిలీ అయ్యారు. ఈమేరకు స్టాంప్ రైటర్లు గురువారం వారికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

టైరు పగిలి మినీ లారీ బోల్తా


బోల్తాపడ్డ మినీ లారీ

నందలూరు, సెప్టెంబరు 26: కడప-చెన్నై జాతీయ రహదారిలోని ఆల్విన్ మౌంట్ స్కూల్ వద్ద గురువారం కడప నుంచి రాజంపేటకు ఎరువు లోడుతో వెళ్తున్న మినీ లారీ వెనుక టైర్ పగలడంతో అదుపు తప్పి రోడ్డుపై అడ్డంగా పడింది. ఆ సమయంలో ఎదురుగా ఏ వాహనం రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. డ్రైవర్ జిలానీబాషా స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

మాతమ్మ గుడికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న రూపానందరెడ్డి

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 26: మండలంలోని చిన్నంపల్లె గ్రామ పంచాయతీ లింగిరెడ్డిపల్లె అరుంధతివాడ గ్రామ ప్రజల అభ్యర్థన మేరకు మాతమ్మ గుడి నిర్మాణానికి రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కారూపానందరెడ్డి రూ.లక్ష ఆర్థిక సహాయం అందించారు. ఈ మేరకు గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరాజు, శివారెడ్డి, గజపతిరాజు, లింగిరెడ్డిపల్లె గ్రామ ప్రజలు, ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి

ఒంటిమిట్ట, సెప్టెంబరు 26: సీసీ కెమెరాలను దుకాణాల వద్ద ఏర్పాటు చేసుకుని పోలీసులకు సహకరించాలని సీఐ కృష్ణంరాజు నాయక్ దుకాణదారులకు సూచించారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలోని దుకాణదారుల యజమానులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఒంటిమిట్టలో చోరీలు ఎక్కువవుతున్నాయని, రామాలయం రాష్ట్ర గుర్తింపు పొందిన ఆలయం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి మనుషులు వస్తున్నారని, వారిని గుర్తించడం కష్టమవుతోందన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే పాత నేరస్తులు, కరుడుగట్టిన వ్యక్తులను గుర్తించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది దుకాణ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లి విద్యార్థుల ప్రతిభ


విజేతలుగా నిలిచిన కస్తూర్బా విద్యార్థులు

రాజంపేట, సెప్టెంబరు 26: రాజంపేటలో జరిగిన క్రీడా పోటీల్లో వీరబల్లికి చెందిన కస్తూర్బా పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ సాయిదివ్య, వ్యాయామ ఉపాధ్యాయురాలు చెన్నూరు పార్వతిలు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగిన వివిధ క్రీడా పోటీల్లో యోగాలో ప్రథమ స్థానం దీపిక సాధించగా రెండో స్థానాన్ని అండర్-14 యోగా పోటీల్లో పి.జయలక్ష్మీ, జె.హారిక ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించినట్లు తెలిపారు. చెస్ పోటీల్లో అండర్-17లో జి.పూజ ప్రథమ స్థానం సాధించారన్నారు. అండర్-17 రన్నింగ్‌లో జి.మనుషా ప్రథమ స్థానాన్ని పొందారన్నారు. 800 మీటర్ల అండర్-17లో జి.మనూషా ప్రథమస్థానాన్ని సాధించారన్నారు. అండర్-14 చెస్‌లో జిల్లా ఛాంపియన్‌షిప్‌కు ఈ.మేఘన, ఆర్.ధనలక్ష్మీ ఎంపికైనట్లు తెలిపారు.

జాగ్రత్తలతోనే ఎయిడ్స్ దూరం

● రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్

రాయచోటిటౌన్, సెప్టెంబరు 26: జాగ్రత్తలు పాటించడం ద్వారా ఎయిడ్స్ వ్యాధిని దూరం చేయవచ్చని రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో పీసీఎస్‌ఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ మహమ్మారిపై పోలీసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీసీఎస్‌ఎస్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రూ.20 వేలు ఆర్థిక సాయం

పుల్లంపేట, సెప్టెంబరు 26: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కుటుంబానికి రెడ్డిపల్లె టీడీపీ బీసీ నాయకులు గురువారం రూ.20 వేలు సాయం చేశారు. మండల పరిధిలోని సీతారాంపేట వద్ద రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు యాక్సిడెంటులో రెడ్డిపల్లె, అరుంధతివాడకు చెందిన గన్నేరు వెంకటేశ్వర్లు మృతిచెందాడు. దీంతో రొంపిచెర్ల మురళి రూ.20 వేలు ఆర్థికసాయం అందజేసి, మృతుని కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

స్వచ్ఛభారత్ నిరంతర ప్రక్రియగా కొనసాగాలి

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్‌నాయుడు

నందలూరు, సెప్టెంబరు 26: స్వచ్ఛభారత్ మనిషి జీవితంలో నిరంత ప్రక్రియగా కొనసాగాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు పేర్కొన్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని నాగిరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటి అనంతరం స్వచ్ఛభారత్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి పోతుగుంట రమేష్‌నాయుడు హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నాగయ్య, బీజేపీ గిరిజన మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోతురాజు మస్తానయ్య, బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆదినారాయణ, బీజేపీ కిసాన్‌మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాపయ్య, బీజేపీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ కళాశాల ఏర్పాటుపై హర్షం

రాజంపేటటౌన్, సెప్టెంబరు 26: అమరావతిలో అంతర్జాతీయ న్యాయ కళాశాల ఏర్పాటుపై రాజంపేట న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు రాజంపేట పార్లమెంట్ టీడీపీ లీగల్ సెల్ కార్యాలయంలో ఆ సంఘ అధ్యక్షుడు తరిగోపుల లక్ష్మీనారాయణ అధ్యక్షతన న్యాయవాదుల సమావేశాన్ని నిర్వహించారు. రాజంపేట టీడీపీ న్యాయవాదుల అసెంబ్లీ అధ్యక్షుడు సింగంశెట్టి కృష్ణకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌నాయుడు, కందుల వెంకటరమణ, పలుకూరి రామాంజనేయులు, మన్నేరు వెంకటసుబ్బయ్య, సింగంశెట్టి గిరీష్‌కుమార్, నాగేంద్రబాబు, పుల్లంపేట లీగల్‌సెల్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అమరావతి అంతర్జాతీయ న్యాయ కళాశాల ఏర్పాటుకు 100 ఎకరాల స్థలం కేటాయించడం, జూనియర్ న్యాయవాదులకు రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తామనడం, కర్నూలుకు హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

టీడీపీ ప్రభుత్వంలోనే సంక్షేమ ఫలాలు

● డాక్టర్ మండిపల్లె లక్ష్మీప్రసాదురెడ్డి


కార్యక్రమంలో మాట్లాడుతున్న లక్ష్మీప్రసాదురెడ్డి

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 26: టీడీపీ ప్రభుత్వంలోనే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయని పేర్కొన్నారు. గురువారం అనంతపురం ఈడిగపల్లెలో మండల యువనాయకుడు మాజీ ఎంపీటీసీ యనమల మదన్‌మోహన్ ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండిపల్లె సోదరుడు ముఖ్యఅతిథిగా హాజరై అర్జీలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ప్రభుత్వం వంద రోజులు సంపూర్ణంగా పూర్తి చేసుకున్నదన్నారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, హౌసింగ్ పీడీ సాంబశివయ్య, జిల్లా పశువైద్యాధికారి గుణశేఖర్‌పిళ్లైలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీరాజ్‌శాఖ అధికారి దయాకర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ శ్రీనివాసులు, ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ లక్ష్మీప్రసన్న, అగ్రికల్చర్ ఏడీఏ జయరాణి, సీడీపీఓ పద్మావతి, మాజీ జడ్పీటీసీ రెడ్డయ్యయాదవ్, ఏఐసీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, రాజంపేట ఆర్‌ఎంపీ డాక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి, మైనార్టీ నాయకుడు షఫీనాయక్, వెంకటరామరాజు, ఏ1 కాంట్రాక్టర్ పాపయ్య, బాబుల్‌రెడ్డి, జేకేరెడ్డి, దేవనాథరెడ్డి, మాజీ ఎంపీటీసీ శంకారపు జయరాం, రామాపురం మండల యువనాయకుడు చెన్నక్రిష్ణారెడ్డి, అన్ని శాఖల అధికారులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి దాతృత్వం

● 185 భోజనం ప్లేట్లు వితరణ


ప్లేట్లను పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

గాలివీడు, సెప్టెంబరు 26: ప్రభుత్వ ఉపాధ్యాయుడు బుక్కపట్నం సుబ్బరాయుడు 185 భోజనం ప్లేట్లు విద్యార్థులకు పంచిపెట్టి తన దాతృత్వం చాటుకున్నాడు. గురువారం మండలంలోని గాండ్లపల్లి, గాలివీడు జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఫిజిక్స్ ఉపాధ్యాయుడు సుబ్బరాయుడు తన సొంత నిధులతో భోజనం ప్లేట్లు ఇవ్వడంతో పాటు విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవమ్మ, విద్యాధికారులు నాగరాజు, శ్రీనివాసులు హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివి నిరుపేద విద్యార్థుల అవసరాలను తీర్చేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మొహిద్దీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటర్ల కాపర్ వైరు చోరీ

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 26: మండలంలోని కాకుళవరం పంచాయతీలోని వాయిల్‌రాజుగారిపల్లె, కాకుళవరం గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి 10 వ్యవసాయ మోటర్ల కాపర్ వైర్లు అపహరించుకు పోయినట్లు రైతులు రామాంజుల్‌రెడ్డి, వర్లరామయ్య, అరుణ్‌బాష, గొర్ల వీరనాగయ్య, దాదాసాహెబ్‌లు తెలిపారు. ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురవకపోవడంతో అష్టకష్టాలు పడి బోర్ల కింద వరిపంట సాగుచేశామని, తీరా పంట చేతికొచ్చే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు స్టార్టర్, మోటారు, బోర్‌లోపల ఉన్న కాపర్ వైర్ తీసుకెళ్లారని వారు వాపోయారు. ఈ మేరకు గురువారం లక్కిరెడ్డిపల్లె పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

ఉత్కంఠ భరితంగా అథ్లెటిక్స్ పోటీలు


హైజంప్ పోటీల్లో విద్యార్థులు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 26: జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని మాసాపేట జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా అండర్-14, 17 బాలుర, బాలికల విభాగంలో 100, 200, 400, 800, 1500, 3000 మీటర్ల పరుగు పందెం, హైజంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కత్రో, జావెలిన్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో పాల్గొంటారని క్రీడా పోటీల కోఆర్డినేటర్ జగదీశ్వరయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరు మండలాల వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఛలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయండి'

రాజంపేట, సెప్టెంబరు 26: కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ తదితర కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరుతూ ఈ నెల 30న తలపెట్టిన ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాజంపేటలో ఛలో కలెక్టరేట్ కరపత్రాలను కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఎన్నో ఏళ్లుగా ఉద్యోగాలు పర్మినెంట్‌కాక కాంట్రాక్టు సిబ్బందిగానే పని చేస్తూ చాలీ చాలని జీతాలతో చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి


టోల్‌గేట్ వద్ద రాస్తారోకో నిర్వహిస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు(రూరల్), సెప్టెంబరు 26: నియోజకవర్గంలోని చిట్వేలి, కోడూరు మండలంలోని బొప్పాయి రైతులు గురువారం తమ పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని టోల్‌గేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.చంద్రశేఖర్ మాట్లాడుతూ బొప్పాయి రైతులకు కనీస ధర కేజీ రూ.25 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, బొప్పాయి రైతులు తదితరులు పాల్గొన్నారు.

తమ్మిరెడ్డి శివశంకర్‌ను కలిసిన శివప్రసాద్


శివశంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన శివప్రసాద్

రాజంపేట,సెప్టెంబరు 26: ఏపీఎంఎస్ ఎండీ నూతన చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్‌ను విజయవాడ తాడేపల్లెలో ఆయన స్వగృహంలో రాయలసీమ జోన్ ఎన్నికల కన్వీనర్ చెంగారి శివప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనకు దక్షిణాది అయోధ్య ఒంటిమిట్ట కోదండరాముల వారి పవిత్ర మాల, తీర్థ ప్రసాదాలు ఇచ్చారు. ఉమ్మడి కడప జిల్లా నిరుద్యోగుల, గల్ఫ్ వలస కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలని శివశంకర్‌ను కోరామన్నారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలియజేశారు.

చిన్నపిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● ప్రధానోపాధ్యాయుడు దుర్గేశ్వర్‌రాజు

గాలివీడు, సెప్టెంబరు 26: చిన్నపిల్లలపై అఘాయిత్యాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రధానోపాధ్యాయులు దుర్గేశ్వర్‌రాజు పేర్కొన్నారు. గురువారం స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో సమాజంలో చిన్నపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌డబ్ల్యు భారతి, పాఠశాల ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు రమణయ్య, ఫైరోజా, నిర్మల, షబాన తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో తెప్పోత్సవానికి పుష్కరిణి సిద్ధం



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 26: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో శుక్రవారం నిర్వహించనున్న తెప్పోత్సవానికి ఆలయ పుష్కరిణిని అధికారులు గురువారం సాయంత్ర సిద్ధం చేయించారు. ఈ సందర్భంగా ఆలయ పుష్కరిణిలోని పాతనీటిని పూర్తిగా తొలగించి.. తాజా నీటితో నింపారు. పుష్కరిణిలోనికి ఎంత మంది భక్తులను అనుమతించాలని పోలీసు అధికారులతో ఆలయ ఈవో గురుప్రసాద్ చర్చించారు.

పరిశ్రమల స్థాపనతోనే నిరుద్యోగ సమస్యకు పరిష్కారం

ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద రావు



ప్రసంగిస్తున్న దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 26: పరిశ్రమల స్థాపనతోనే నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుందని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ)పై జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీతోపాటు ఖాదీ, గ్రామీణ పరిశ్రమల రాష్ట్ర కమిషనర్ (కేజీఐపీ) డైరెక్టర్ ఎస్.గ్రీప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పీఎంఈజీపీ కింద విరివిగా రుణాలు, సబ్సిడీ మంజూరు చేస్తుందన్నారు. చదువుకున్న యువత వీటిని సద్వినియోగం చేసుకుని పరిశ్రమలు, ప్రాజెక్టులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డీఆర్‌డీఏ పీడీ తులసి, ఎల్‌డీఎం హరీష్, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

'చిన్నారి మృతికి మా మెడిసిన్ కారణం కాదు'

- ఇంట్లో చనిపోతే మాపై నింద మోపారు
- పోస్టుమార్టంలో మా మందులు కారణం కాదని తేలింది
- పుంగనూరు ఘటనపై డాక్టర్ కార్తీక్ స్పందన

పుంగనూరు, సెప్టెంబరు 26: పుంగనూరు పట్టణంలో ఈనెల 21వ తేదీన ఓ చిన్నారి మృతి చెందితే.. దానికి కారణం వైద్యుడేనని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించి వైద్యుడిపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంగా ఆరోపణలు ఎదుర్కొన్న డాక్టర్ కార్తీక్ తాజాగా స్పందించి జరిగిన పరిణామాలపై స్పష్టతనిచ్చారు. 'పుంగనూరు పట్టణం నక్కబండకు చెందిన సాత్విక్ అనే చిన్నారి 21వ తేదీన రాత్రి 9 గంటలకు ఇంట్లో పొరపోవడంతో చనిపోతే, దానికి నా మందులే కారణమనే నిందను మోపి నాపై 30 మంది కలిసి దాడి చేశారు. మా వద్ద పది రోజులు చికిత్స తీసుకున్నామని, మేమిచ్చిన చుక్కల మందు మరణానికి కారణమని వారు చేసిన ఆరోపణలు అవాస్తవం. మా మందు కారణమైతే అదే చిన్నారికి, అదే మందును 14వ తేదీన కూడా ఇచ్చాం. అప్పుడు వికటించలేదు కదా. చిన్నారికి జరిపిన పోస్టుమార్టంలో కూడా మా మందులు కారణం కాదని తేలింది. అప్పటినుంచి మా వద్ద గతంలో మందులు తీసుకున్నవారు కూడా వెనక్కి ఇచ్చేస్తున్నారు. వైద్యారోగ్య శాఖ వారు తనిఖీలు చేసి మందులన్నీ సక్రమంగా ఉన్నాయని చెప్పారు. చేయని నేరానికి నింద మోయడం బాధగా ఉంది.' అని డాక్టర్ వివరణ ఇచ్చారు.

ఇరిగేషన్ డిజైన్స్ ఎస్ఈగా శారద

- పలువురు ఈఈల బదిలీ

తిరుపతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ తిరుపతి తెలుగు గంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో డిజైన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ విభాగం ఎస్ఈగా ఓరింపాటి శారద నియమితులయ్యారు. ఇప్పటి వరకూ కడప జిల్లా ఇరిగేషన్ శాఖలో డిజైన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ విభాగం ఎస్ఈగా ఉన్న ఆమె గురువారం ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా తిరుపతికి బదిలీ అయ్యారు. శ్రీకాళహస్తి తెలుగు గంగ ప్రాజెక్టు గాలేరు-నగరి విభాగం ఒకటవ డివిజన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సుబ్రమణ్యం మంజుల కడప జిల్లా ఎస్‌కేడీ జీఎన్‌ఎస్ఎస్ సర్కిల్‌కు బదిలీ అయ్యారు. నెల్లూరు జిల్లా సోమశిల ప్రాజెక్టు 2వ డివిజన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా వ్యవహరిస్తున్న ఇరగా శ్రీనివాసరావు అక్కడ నుంచీ గూడూరు ఎన్ఎస్ డివిజన్‌కు బదిలీ అయ్యారు. అనంతపురం తుంగభద్ర ప్రాజెక్టు కార్యాలయం నుంచీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రజావత్ సునీల్ నాయక్ తిరుపతి తెలుగు గంగ చీఫ్ ఇంజనీర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. విజయనగరం జిల్లా బొబ్బిలి నుంచీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరాజు రేణిగుంట జీఎన్‌ఎస్ఎస్ డివిజన్‌కు బదిలీ అయ్యారు.

చిత్తూరు ఆర్డీవోగా శ్రీనివాసులు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 26: చిత్తూరు ఆర్డీవోగా ఎం.శ్రీనివాసులును నియమిస్తూ గురువారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న చిన్నయ్యను బదిలీ చేస్తూ.. ప్రభుత్వ కార్యదర్శి ముందు రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించింది. కాగా, శ్రీనివాసులు.. నెల్లూరు జిల్లా రాపూరు డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తుండగా, చిత్తూరు ఆర్డీవోగా బదిలీ చేశారు.

బాపట్ల ఆర్డీవోగా గ్లోరియా

బాపట్ల ఆర్డీవోగా చిత్తూరు పూర్వ జడ్పీ సీఈవో గ్లోరియాను ఆమె మాతృశాఖ అయిన రెవెన్యూకు బదిలీ చేస్తూ గతంలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా బాపట్ల ఆర్డీవోగా నియమిస్తూ గురువారం రాత్రి ఉత్తర్వులిచ్చింది.

కడప కమిషనర్‌గా పలమనేరు ఆర్డీవో బదిలీ

పలమనేరు ఆర్డీవో మనోజ్ రెడ్డిని కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పాఠశాలలో గుండెపోటుతో హెచ్ఎం మృతి



సోమల, సెప్టెంబరు 26: సోమల మండలం చింపిరెడ్డిగారిపల్లె పాఠశాల హెచ్ఎం. డి. సుధాకర్‌నాయుడు గుండెపోటుతో గురువారం మృతిచెందాడు. బసవ పల్లెకు చెందిన సుధాకర్ నాయుడు గురువారం పాఠశాలకు వెళ్లి తీవ్ర ఛాతీ నొప్పితో పెద్ద ఉప్పరపల్లె ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సలు పొందుతూ మృతి చెందారు. ఆయన మృతదేహానికి ఎంఈవోలు శివరత్న, శ్రీరాములు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు.

అర్జీల్లో సింహభాగం గుడుపల్లె రెవెన్యూ సమస్యలపైనే

కుప్పంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక



ప్రజలనుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ తదితరులు

కుప్పం, సెప్టెంబరు 26:ప్రజా సమస్యలను ఏమాత్రం అలక్ష్యం చేయవద్దని, అలా చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను హెచ్చరించారు. కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం కడా పీడీ వికాస్ మర్మత్‌తో కలిసి ఆయన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పాల్గొని ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నియోజకవర్గమైన కుప్పంలో సమస్యల పరిష్కారం సంతృప్తి స్థాయిలో జరగాలని అధికారులకు సూచించారు. ప్రజల నుంచి మొత్తం 117 అర్జీలు వివిధ సమస్యలపై అధికారులకు అందాయి. ఇందులో గుడుపల్లె రెవెన్యూకు సంబంధించి ఏకంగా 95 అర్జీలు ఉన్నాయి. భూ సర్వేకు చెందినవి 15, పోలీస్ 4, మున్సిపల్, పబ్లిక్ హెల్త్, నీటి సమస్యలకు సంబంధించి ఒక్కో అర్జీ వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస రాజు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ ఛైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.









మృతిచెందిన క్లీనర్ యాదగిరి - కాలిపోయిన డ్రైవర్ రామ్‌రాజ్ మృతదేహం - తీవ్రంగా గాయపడ్డ డ్రైవర్ సాయికృష్ణ, క్లీనర్ నాగయ్య

ఆగివున్న లారీని ఢీకొన్న లారీ

డీజిల్ ట్యాంక్ పగిలి దగ్ధమైన లారీ

మొగిలి ఘాట్‌లో మరో ప్రమాదం

ఇద్దరి మృతి - మరో ఇద్దరికి తీవ్రగాయాలు



దగ్ధమవుతున్న లారీ

బంగారుపాళ్యం, సెప్టెంబరు 26 : మరమ్మతుల కోసం రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక వైపు మరో లారీ ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.గురువారం వేకువ జామున బంగారుపాళ్యం మండల పరిధిలోని మొగిలి ఘాట్ లో చోటు చేసుకున్న ఈ ప్రమాద వివరాలు పోలీసుల కథనం మేరకు...వి.కోట నుంచి కట్టెల లోడుతో భద్రాచలం వెళుతున్న ఓ లారీ బుధవారం మధ్యాహ్నం ఇంజన్ మొగిలి ఘాట్ వద్దకు రాగానే పాడైంది.దీంతో రోడ్డు పక్కనే లారీని ఆపి డ్రైవర్,క్లీనర్ విశ్రాంతి తీసుకున్నారు. లారీ సమీపంలోనే రాత్రి నిద్రపోయారు.ఈ నేపథ్యంలో రాత్రి రెండున్నర గంటల సమయంలో బెంగళూరు నుంచి పంచదార లోడుతో వెళుతున్న మరో లారీ అక్కడే అదుపు తప్పింది.పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను ఢీకొంటూ ఆగివున్న లారీని బలంగా ఢీకొంది. అలాగే పక్కకు తిరిగి పక్కన ఉన్న రక్షణ గోడను ఢీకొని పెద్దగోతిలో పడిపోయి నుజ్జునుజ్జైంది. లారీ ఢీకొనడంతో ఆగివున్న లారీలో డీజల్ ట్యాంకు పగిలి మంటలు చెలరేగి లారీ దగ్ధమైంది. ఘటనా స్థలానికి డీఎస్పీ ప్రభాకర్, సీఐ శ్రీనివాసులు చేరుకుని చిత్తూరు, పలమనేరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమందించి సహాయక చర్యలు చేపట్టారు. అగ్నిమాపక జిల్లా అధికారి పెద్దిరెడ్డి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని లారీలో మంటలను ఆర్పివేశారు. ఎక్స్‌కవేటర్ సాయంతో లారీలో వున్న కట్టెలను తొలగించారు. లారీ కింద అల్లూరి సీతారామరాజు జిల్లా చింతలగూడేనికి చెందిన డ్రైవర్ జామిశెట్టి రామరాజ్(50) పూర్తిగా కాలి మాంసంముద్దలా మారిపోయివుండడం గమనించారు.తీవ్రంగా గాయపడ్డ క్లీనర్ నాగయ్యను 108అంబులెన్స్‌లో బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చక్కెర లోడు లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడకు చెందిన డ్రైవర్ సాయికృష్ణ(31), వరంగల్లుకు చెందిన క్లీనర్ యాదగిరి(50)లను ఎక్స్‌కవేటర్ సాయంతో బయటకు తీసుకొచ్చారు. క్లీనర్ యాదగిరి అప్పటికే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన సాయికృష్ణను 108అంబులెన్స్‌లో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతదేహాలను ప్రైవేటు అంబులెన్స్ ద్వారా బంగారుపాళ్యం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

ట్రాఫిక్ మళ్లింపు

ప్రమాదంలో లారీ దగ్ధమవడంతో సుమారు 3 గంటల పాటు జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.సుమారు 2 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రమాదాలకు గురైన లారీలను తొలగించి పోలీసులు వన్ వే ద్వారా వాహనాలను పంపించారు.పంచదార లోడుతో వస్తున్న లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. లారీ డ్రైవర్ సాయికృష్ణకు మొగిలి ఘాట్ మీద అవగాహన లేకపోవడంతో అతివేగంగా రావడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు.







కట్టెల లారీని ఢీకొట్టి ఛిద్రమైన చక్కెర లారీ - ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై భారీగా నిలిచిపోయిన వాహనాలు - లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన యాదగిరిని ఎక్స్‌కవేటర్‌తో వెలికితీస్తున్న దృశ్యం

సాయం అందకనే చనిపోయాడు

తొమ్మిది నెలలుగా మృత్యువుతో పోరాడి ఓడిపోయిన దత్తాత్రేయ - విధి నిర్వహణలో గాయపడ్డా సచివాలయ ఉద్యోగికి అందని సాయం



దత్తాత్రేయ (ఫైల్ ఫొటో)

పెనుమూరు, సెప్టెంబరు 26: ప్రభుత్వ సాయం అందకనే సచివాలయ ఉద్యోగి దత్తాత్రేయ తనువు చాలించాడు. 9నెలల క్రితం జరిగిన ఓ యాక్సిడెంట్‌లో ఇతను గాయపడి కోమాలోకి వెళ్లిపోయాడు. ఉద్యోగి రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రి పాలై నెలలు గడిచినా అప్పటి వైసీపీ ప్రభుత్వం ఎటువంటి సాయం అందించలేదు. కుటుంబ సభ్యులు.. అప్పటి కలెక్టర్, ఎమ్మెల్యేలను కలిసి తమ కుమారుడి దీన స్థితిని వివరించారు. తమ బిడ్డకు ప్రాణభిక్ష పెట్టండంటూ వేడుకున్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ వస్తే కాస్త ఆదరవుగా ఉంటుందని తిరిగి తిరిగి వేసారిపోయారు. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం వచ్చాక ఇతడి పరిస్థితిని తెలుసుకున్న ఆంధ్రజ్యోతి ఈనెల 20వ తేదీన 'నా బిడ్డను ఆదుకోండి' అనే శీర్షికన కథనం కూడా ప్రచురించింది. సాయం అందేలోగా దాదాపు తొమ్మిది నెలలుగా మృత్యువుతో పోరాడి గురువారం మృతి చెందాడు.

చంద్రగిరి మండలం మల్లంగుంట రోడ్డు ఉత్తరపు కండ్రిగలోని లక్ష్మి, ఎల్లయ్య దంపతుల ఒక్కగానొక్క కుమారుడు దత్తాత్రేయ. పెనుమూరు మండలం కామచిన్నయ్యపల్లె సచివాలయంలో వెల్ఫేర్ సెక్రటరీగా పనిచేసేవాడు. గత ఏడాది డిసెంబరు 29వ తేదీన ఆడుదాం ఆంధ్ర పోటీలకు తిరుపతి నుంచి ఫ్లెక్సీలు తీసుకుని పెనుమూరుకు ద్విచక్ర వాహనంలో బయల్దేరాడు. ఉదయం 7.30 గంటలకు చంద్రగిరి ఫ్లైఓవర్ వద్ద జరిగిన యాక్సిడెంట్‌లో తలకు తీవ్రగాయమైంది. మరో ఉద్యోగికి కాలు విరిగింది. దత్తాత్రేయకు తొలుత సీఎంసీలో ఆపరేషన్ చేసినా ప్రయోజనం లేకపోయింది. అప్పటికే సుమారు రూ.10లక్షల ఖర్చయ్యింది. పేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులకు సహ ఉద్యోగులు, స్నేహితులు తలో చెయ్యి వేసినా సరిపోలేదు. కొద్ది రోజుల తర్వాత తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పోస్ట్ ఆపరేటివ్ చికిత్స చేయించినా.. ఇంట్లోనే పెట్టుకుని తల్లిదండ్రులు చూసుకుంటున్నారు. చివరకు ప్రభుత్వ సాయం అందే లోపు మృతి చెందడం.. సహోద్యోగులు, స్థానికులను కలచివేసింది.

పేద కుటుంబంలో పుట్టినా..

పేద కుటుంబంలో పుట్టి కుటుంబ ఆర్థిక పరిస్థితులను చూస్తూ గొప్ప స్థాయికి ఎదగాలని చదువులో ముందుండేవాడు దత్తాత్రేయ. సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధించాలనే తపనతో చదివాడు. మధ్యలోనే సచివాలయ ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటూ.. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. ఈ క్రమంలోనే యాక్సిడెంట్ జరిగి.. ఇపుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు.

చిత్తూరులో విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయం

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం ● కార్యాలయ భవనం, అధికారుల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్న అధికారులు



చిత్తూరు విద్యుత్ కార్యాలయం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 26: ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లాను విభజన చేసి.. విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయ ఏర్పాటును గాలికొదిలేశారు. అప్పటి నుంచి విద్యుత్ వినియోగదారులకు సమస్యలు తలెత్తితే తిరుపతిలోని సర్కిల్ కార్యాలయానికి వెళ్లి మొరపెట్టుకోవాల్సి వచ్చేది. వ్యయప్రయాసలతో అక్కడికి చేరుకుంటే.. అక్కడ ఎస్ఈ లేకుంటే వెనుతిరిగేవారు. వీటన్నింటికీ చెక్ పెడుతూ కూటమి ప్రభుత్వం చిత్తూరు జిల్లాకు ప్రత్యేక సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

సర్కిల్ కార్యాలయ భవనంపై క్లారిటీ లేదు

చిత్తూరు సర్కిల్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే కార్యాలయం ఎక్కడ ఏర్పాటు చేస్తారు.. ప్రభుత్వ భవనంలోనా? లేక అద్దె భవనంలోనా? ఎప్పుడు ఏర్పాటు చేస్తారు? అనే క్లారిటీ ఇవ్వలేదు ప్రభుత్వం. అధికారులు, సిబ్బంది స్థానాలను కేటాయించారే తప్ప ఇంకా అధికారులేవరనేదీ స్పష్టత ఇవ్వలేదు. దీనిపై ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

చిత్తూరు సర్కిల్ పరిధిలో డివిజన్లు ఇవే

కొత్తగా ఏర్పాడిన చిత్తూరు సర్కిల్ పరిధిలో చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్, పుంగనూరు, పుత్తూరు డివిజన్లు ఉంటాయి.

14 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 26: జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 14మండలాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. విజయపురంలో అత్యధికంగా 65.6 మి.మీ, సదుంలో అత్యల్పంగా 0.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా.. నగరిలో 42.2, నింద్రలో 38.4, పాలసముద్రంలో 29.2, చిత్తూరు రూరల్‌లో 26, కార్వేటినగరంలో 14.6, పులిచెర్లలో 12.4, వెదురుకుప్పంలో 9.2, ఐరాలలో 7.4, చౌడేపల్లెలో 3.2, శ్రీరంగరాజపురంలో 3, పెనుమూరులో 2.2, చిత్తూరు అర్బన్‌లో ఒక మి.మీ వర్షంకురిసింది.

డీఆర్డీఏ ఇన్‌చార్జి పీడీగా రవికుమార్ నాయుడు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 26: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఇన్‌చార్జి పీడీగా జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడిని నియమిస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. బదిలీ అయిన డీఆర్డీఏ పీడీ తులసిని గురువారం రిలీవ్ చేసి రవికుమార్ నాయుడికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.







షాట్‌పుట్ - లాంగ్ జంప్ - వంద మీటర్ల పరుగు పందెం

చిత్తూరులో 'స్కూల్ గేమ్స్' ప్రారంభం



డీఎస్‌ఏ మెసానికల్ మైదానంలో క్రీడాకారుల సందడి

చిత్తూరు క్రీడలు, సెప్టెంబరు 26: ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు చిత్తూరు డీఎస్‌ఏ మెసానికల్ మైదానంలో అథ్లెటిక్స్ అండర్ 14, 17 బాలబాలికల పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. రన్నింగ్, లాంగ్ జంప్, షాట్‌పుట్, జావెలింగ్ త్రో పోటీలు జరిగాయి. శుక్రవారం కూడా పోటీలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఆ తర్వాత ఫలితాలు ప్రకటిస్తామన్నారు.

మౌలిక వసతుల కల్పనలో ఫెడరేషన్ విఫలం : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దూర ప్రాంతాల నుంచి వందలాది మంది బాలబాలికలు ఎంపిక పోటీలకు తరలివచ్చారు. వీరికి మౌలిక వసతుల కల్పనలో ఫెడరేషన్ అధికారులు విఫలమైనట్లు విమర్శలు వినిపిస్తున్నారు. ఆధ్వాన మరుగుదొడ్లతో బాలికలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భోజనం కూడా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే మిడ్డేమీల్స్‌నే క్రీడాకారులు సరఫరా చేశారు. ఆ భోజనాలు నాణ్యత లేక వాటిని తినలేక క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆస్థి కోసమే తల్లిని గొంతు కోసి చంపారు

● హత్య కేసులో కొడుకు, కోడలు అరెస్టు

ములకలచెరువు, సెప్టెంబరు 26: ఆస్థి కోసమే తల్లిని గొంతు కోసి దారుణంగా చంపారని సీఐ రాజారమేష్ పేర్కొన్నారు. ఈదారుణానికి వడిగట్టిన కొడుకు, కోడలిని గు రువారం అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు స్థానిక సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సీఐ రాజారమేష్, ఎస్ఐ గాయత్రి వివరాలను వెల్లడించారు. ములకలచెరువులోని కదిరి రోడ్డులో నివాసముంటున్న షేక్ షఫియా బేగంకు ఇద్దరు కుమారులు పెద్దరెడ్డి బాషా, చిన్నరెడ్డిబాషా, కుమార్తె సోనిలు ఉన్నారు. ఈమె భర్త షేక్ హైదర్‌వల్లి ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో షఫియాబేగం చిన్నకుమారుడు చిన్నరెడ్డిబాషా దగ్గర ఉంటోంది. తమకున్న ఆస్థి మొత్తం తనకే ఇవ్వాలని చిన్నరెడ్డిబాషా తల్లితో తరచూ గొడవ పడేవాడు. ఈ క్రమంలో ఈ నెల 22వతేదీన తల్లి షేక్ షఫియాబేగం(55)పై మరోసారి గొడవకు దిగిన చిన్నరెడ్డిబాషా, అతని భార్య అర్షియాలు కట్టెతో కొట్టి, గొంతు కోసి దారుణంగా హత్య చేశారన్నారు. షఫియా బేగం కూతురు సోని ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసిన పోలీసులు చిన్నరెడ్డిబాషా(31), అతని భార్య అర్షియా(25)లను తంబళ్లపల్లె రోడ్డులో అరెస్టు చేసి హత్యకు వినియోగించిన కత్తి, దాడి చేసిన కట్టెలను సీజ్ చేశారన్నారు. రిమాండ్ నిమిత్తం తంబళ్లపల్లె కోర్టులో హాజరు పరుస్తామని సీఐ రాజారమేష్ తెలిపారు.

తప్పిపోయిన బాలుడిని చైతన్య అనాథాశ్రమానికి తరలింపు


బాలుడిని అనాథాశ్రమానికి చేర్పిన పోలీసులు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 26: పట్టణంలోని ఎస్టేట్ పరిసర ప్రాంతంలో ఐదేళ్ల బాలుడు బుధవారం రాత్రి తచ్చాడుతుంటే స్థానికులు పోలీసులకు సమా చారం అందించగా వారు చైతన్య అనాథాశ్రమానికి తరలించారు. తాలుకా సీఐ కళా వెంకటరమణ ఆదేశాల మేరకు ఎస్ఐ హరిహరప్రసాద్ అక్కడికి చేరుకుని బాలున్ని విచారించగా ఎక్కడ నుంచి వచ్చాడు, ఏమి వివరాలు చెప్పలేని పరిస్థితిలో దేవతానగడర్‌లోని చైతన్య అనాథాశ్రమానికి తరలించారు. ఈ బాలునికి సంబంధించిన ఆధారాలు దొరికేవరకు ఆశ్ర మంలో అవకాశం కల్పించాలని పోలీసులు కోరారు. ఈ పిల్లవాడి గురించి వివరాలు ఎవ్వరికైనా తెలిసిన వెంటనే 9493871884, 9133006333 నెంబర్లకు ఫోన్ చేయాలని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


సాయిసుధా (ఫైల్ ఫొటో)

పీలేరు, సెప్టెంబరు 26: అనుమానాస్పద స్థితిలో చెరువులో శవమై తేలిన ఓ వివాహిత ఉదంతం గురువారం పీలేరులో వెలుగు చూసింది. పీలేరు ఎస్ఐ బాలకృష్ణ కథనం మేరకు పీలేరు మండలం బోడుమల్లువారిపల్లె పంచాయతీ మొరవపడ్డిపల్లె చె రువులో ఓ మహిళ శవం తేలియాడు తున్నట్లు స్థానికులు గురువారం పీలేరు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు చెరువు వద్ద కు చేరుకుని అగ్నిమాపక సిబ్బంది, పారిశుధ్య కార్మికుల సాయంతో శవాన్ని ఒడ్డుకు చేర్చి విచారణ ప్రారంభించారు. శవం బాగా కుళ్లిన స్థితిలో ఉండడం, నడుము కు రాయి కట్టి ఉండడంతో అనుమానం వచ్చిన పోలీసులు చుట్టుపక్కల విచారిం చడంతో మృతురాలి ఆచూకీ లభ్యమైంది. ఆమె స్థానికంగా బట్టీ ల పనిచేసే తమిళనాడుకు చెందిన మణి భార్య సాయిసుధ(25)గా గుర్తించారు. గత మంగళవారం రాత్రి భార్యాభర్తలు గొడవ పడి ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయిందని, అప్పటి నుంచి కనిపించకుండా ఉందని తేలింది. ఆమె ఆత్మహత్య చేసుకుందా? లేక ఎవరైనా చంపి నడుముకు రాయి కట్టి చెరువులో పడేశారా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి స్నేహ, కృష్ణదేవ అనే ఇద్దరు పిల్లలున్నారు. పోలీసులు ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుప త్రికి తరలించారు.

టీడీపీ కార్యకర్తకు చెందిన ఆటోకు నిప్పు


మంటల్లో కాలిపోయిన ఆటోను పరిశీలిస్తున్న పోలీసులు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 26: తంబళ్లపల్లె మండలంలోని గోపిదిన్నె పంచాయతీ బళ్లాపురంపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త కే.వీరాంజినేయులుకు చెందిన ఆటోకు బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టి కాల్చివేశారు. దీనిపై బాధితుడి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ లోకేష్‌రెడ్డి సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి వెళ్లి మంటల్లో కాలిపోయిన ఆటోను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు.. ఇటీవల వైసీపీ వర్గీయుల నుంచి వీరాంజినేయులు కొంత వ్యవసాయ భూమిని కొనుగోలు చేశాడు. అప్పటి నుంచి గ్రామంలో ఉన్న పలువురు వైసీపీ వర్గీయులు అతనిపై కక్ష పెంచుకున్నారని ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి గ్రామానికి వచ్చే రోడ్డులో ఓ వైపు ఖాళీ స్థలంలో ఉంచిన తన ఆటోకు నిప్పుపెట్టారన్నారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో టమోటాలను మార్కెట్‌కు తరలించే వాహన డ్రైవర్ ఆటో మంటల్లో కాలిపోతుండటం గమనించి తనకు సమాచారం ఇచ్చాడన్నాడు. దీంతో వీరాంజనేయరెడ్డి, వెంకటరమణారెడ్డి, విజయకుమార్‌రెడ్డిలు నిప్పు పెట్టినట్లు అనుమానం ఉందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యా దులో పేర్కొన్నాడు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వంక ఆక్రమణలపై ఎమ్మెల్యే ఆగ్రహం

● చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు


ప్రభుత్వ భవనాన్ని అద్దెకు తీసుకున్న వ్యక్తితో ఫోన్‌లో వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 26: మదనపల్లె మండలం సీటీఎం క్రాస్‌రోడ్డు పంచాయతిలో వంకను ఆక్రమించుకుని కట్టిన నిర్మాణాలు, ప్రభుత్వ భవనాన్ని ప్రైవేటు వ్యక్తులకు అద్దెకు ఇచ్చిన అంశంపై ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఫైర్ అయ్యారు. గురువారం సీటీఎం క్రాస్ రోడ్డు పంచాయతీలో ప్రజాదర్బార్ నిర్వహించేందుకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజల ఫిర్యాదులో ఆయన క్రాస్‌రోడ్డుకు వచ్చి అక్కడ ఉన్న ప్రభుత్వ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో గ్రంథాలయం నిర్మాణం చేపట్టారని, కాని ఈ గదికి షట్టర్ డోరు బిగించి ఉండటాన్ని గమనించామన్నారు. ఈ గదిని అద్దెకు తీసుకున్న (కార్పెంటర్)వ్యక్తికి ఫోన్ చేసిన ఎమ్మెల్యే పలు విషయాలను రాబట్టారు. స్థానిక వైసీపీ నాయకుడు, ప్రజాప్రతినిధి భర్త తమకు ఈ గదిని నెలకు రూ.5వేలకు అద్దెకు ఇచ్చారని, రూ.30వేలు అడ్వాన్సు ఇచ్చానని చెప్పాడు. ఆయనతో ఎమ్మెల్యే ఫోన్లో మాట్లాడుతూ ప్రభుత్వం భవనాన్ని అద్దెకు తీసుకోవడం తప్పని, వెంటనే ఆ గదిని ఖాళీ చేయాలని సూచించారు. దీంతో పాటు ఈ గదికి ప్రైవేటు వ్యక్తి పేరుతో విద్యుత్ మీటర్ మంజూరు చేశారని, వెంటనే ఈ మీటర్ కనెక్షన్ తొలగించాలని ట్రాన్స్‌కో ఏఈ రమేశ్‌ను ఆదేశించారు. ఇదే ప్రాంతంలో వంకను ఆక్రమించుకుని ఓ వ్యక్తి షాపులు నిర్మించాడన్న ఫిర్యాదుపై ఎమ్మెల్యే విచారించారు. ఎలాంటి ప్లాన్ అప్రూవల్ లేకుండా భవన నిర్మాణాలు చేస్తుంటే పంచాయతీ కార్యదర్శి ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. వంక ఆక్రమణపై వీఆర్వో విచారించి ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. ఆక్రమణలకు సహకరించిన ప్రభుత్వ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. క్రాస్‌రోడ్డు సమీపంలో శ్మశానవాటికను, కొత్తవారిపల్లె పంచాయతీ పరిధిలోని చెరువును ఆక్రమించారని బీజేపీ నాయకుడు కిరణ్ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. అలాగే సీటీఎం పంచాయతీలోని ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన భూములను మాజీ ప్రజాప్రతినిధి అన్యాక్రాంతం చేశారని గురుప్రసాద్ అనే వ్యక్తి ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. వాటితో పాటు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, అర్జీలకు స్వీకరించిన ఎమ్మెల్యే వాటిని సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖాజాబీ, పీఆర్ ఏఈ పీవీ రమణ, టీడీపీ నాయకులు రెడ్డిరామ్‌ప్రసాద్, చల్లా నరసింహులు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం


సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వాల్మీకిపురం, సెప్టెంబరు 26: వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభిరామాలయంలో గురువారం టీటీడీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, ఆలయంలో మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం భోగోత్సవ మూర్తులైన సీతారాములను నూతన వధూవరులుగా అలంకరణలు విశేష భక్తజనం నడుమ సీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. సాయంత్రం సీతాలక్ష్మణ సమేత అలంకరణలు చేసి పురవీధులలో నగరోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు అనిల్‌కుమార్‌స్వామి, బాషికాచార్యులు, గోకుల్ పాల్గొన్నారు.

పోలీస్ క్వార్టర్స్ స్థలం పరిరక్షణకు చర్యలు

ములకలచెరువు, సెప్టెంబరు 26: జిలా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు స్థానిక వినాయకనగర్‌లో ఉన్న పోలీస్ క్వార్టర్స్ స్థలం పరిరక్షణకు చర్యలు తీసుకున్నారు. ములకలచెరువు సీఐ రాజరమేష్, ఎస్ఐ గాయత్రిలు గురువారం రెవెన్యూ శాఖ సర్వేయర్ల చేత పోలీస్ క్వార్టర్స్‌కు కేటాయించిన 38 సెంట్ల భూమిని సర్వే చేయించి పూర్తి స్థాయిలో హద్దులు గుర్తించారు. కార్టర్స్‌కు సంబంధించిన విలువైన స్థలం ఆక్రమణలకు గురికాకుండా ముందు జాగ్రత్తగా చుట్టూ ట్రెంచ్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఈ సర్వేలో వీఆర్వో గంగాద్రి, సర్వేయర్లు ప్రసాద్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 26: గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి పథంలో నడిపించాలని ప్రత్యేక అధికారి ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం విద్యార్థులు, మండల స్థాయి అధికారులు స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా బస్టాండు కూడలిలో ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్యంపై ఎక్కువగా శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, ఈవోపీఆర్డీ చలపతిరావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కలికిరి ఎంపీడీవోగా భానుమూర్తి

కలికిరి, సెప్టెంబర్లు 27: కలికిరి మండల ప్రజా పరిషత్తు ఎంపీడీవోగా భానుమూర్తిని నియమించారు. చిత్తూరు జిల్లా వడమాలపేట ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆయన్ను కలికిరికి బదిలీ చేశారు. కలికిరి ఎంపీడీవోగా పనిచేస్తున్న గంగయ్యను తంబళ్లపల్లె నియోజకవర్గంలోని కురబలకోటకు బదిలీ చేశారు.

రామసముద్రం ఎంపీడీవోగా భానుప్రసాద్

రామసముద్రం, సెప్టెంబరు 26: రామసముద్రం ఎంపీడీవోగా భానుప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇతను మదనపల్లె ఎంపీడీవోగా పనిచేస్తూ రామసముద్రం మండలంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఉండేవారు. కాగా గురువారం మదనపల్లె నుంచి రామసముద్రంకు బదిలీపై ఇక్కడ బాధ్యతలు చేపట్టారు.

అక్రమ నిర్మాణాలను వెంటనే ఆపండి

గుర్రంకొండ, సెప్టెంబరు 26:గుర్రంకొండ ఇందిరమ్మ కాలనీలో అక్రమ నిర్మాణాలను వెంటనే ఆపాలని తహశీల్దార్ శ్రీనివాసులు సూచించారు. గురువారం ఆయన ఇందిరమ్మ కాలనీలో అక్రమంగా నిర్మాణాలు చేస్తున్న గృహాలు, రేకుల షెడ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్రమ కట్టడాలు చేస్తున్న వారి నుంచి వివరాలను సేకరించారు. గుర్రంకొండ ఇందిరమ్మ కాలనీలో చాలా మంది లబ్ధిదారులు గృహాలను అమ్మేసినట్లు తెలిసిందన్నారు. అక్రమ కట్టడాలు చేయకుండా సిబ్బంది ప్రతి రోజు పర్యవేక్షించాలన్ని వీఆర్వో అన్వర్‌కు సూచించారు.

మెడికల్ కాలేజీ నిర్మాణాలు పూర్తి చేయాలి

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 26:మదనపల్లె మెడికల్ కాలేజీ నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రైవేటు కళాశాలలో ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తి అయితే ఈ యేడాది వైద్య విద్యార్థులకు సీట్లు వస్తాయని, మదనపల్లె ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు.

అన్ని రంగాల్లో వృద్ధి సాధించాలి

కలకడ, సెప్టెంబరు 26:రాబోవు ఐదు సంవత్సరాల్లో మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఎంపీడీవో పరమేశ్వరరెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు గురువారం వికసిత్ స్వర్ణాంధ్ర-2047 విజన్‌పై మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈవోఆర్డీ లతీప్ ఖాన్, ఎంఏవో లావణ్య, రెడ్డప్పనా యుడు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు26: ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతున్న మధుకర్‌రెడ్డి (40)యువకుడు మృతి చెందినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. స్థానిక చంద్రకాలనీలో కాపురంఉన్న గోపిదిన్నే మధుకర్‌రెడ్డి తన భార్య నందిని కోళ్లబైలు పంచాయతీ మామిడి గుంపులపల్లె అమ్మగారి ఇంటికి వెళ్లిపోయింది, దీంతో ఈ నెల 16వ తేదీ అత్త ఇంటి వద్దకు వెళ్లి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. అనంతరం స్థానికుల సాయంతో మదనల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా తిరుపతికి రెపర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తాలుకా హెడ్‌కానిస్టేబుల్ రామమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తాలుకా ఎస్ఐగా చంద్రమోహన్

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు26: మదనపల్లె తాలుకా సీఐగా జి.చంద్రమోహన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో జిల్లాలోని వీరబల్లి పోలీస్టేసన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ రమణ జిల్లా హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీపై వెళ్లినట్లు తెలిపారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయం


బడికాయలపల్లె సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

బి.కొత్తకోట, సెప్టెంబరు 26: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బడికాయలపల్లి, బి.కొత్తకోట నగరపంచాయతీ ఆవరణలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సూపర్‌సిక్స్ హామీలను క్రమంగా అమలు చేస్తామన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో వైసీపీ హయాంలో అక్రమ కేసులలో ఇరుక్కున్న టీడీపీ కార్యకర్తలందరికీ విముక్తి లభిస్తుందన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. తంబళ్లపల్లె టీడీపీ నేత జయచంద్రారెడ్డి మాట్లాడుతూ సీయం హామీతో ఇండస్ట్రియల్ కారిడార్ కోసం బి.కొత్తకోటలో 2172 ఎకరాలు, కురబలకోట మండలంలో 600 ఎకరాలు గుర్తించాము. 1350 కోట్లతో హంద్రీనీవా కాలువను విస్తరంచి 1100 టీఎంసీ ల నీళ్లు అందించాలన్న లక్ష్యంతో పనులను ఈ రోజు ప్రారంభించామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్, మునిసిపల్ కమీషనర్ పల్లవి, జనసేన ఇన్‌చార్జ్ సాయినాథ్, సమన్వయకర్త సీడ్ మల్లికార్జున నాయుడు, కుడుంశ్రీనివాసులు, చింతల కిరణ్‌రాయల్, గుత్తికొండ త్యాగరాజు, లోకనాథ్‌రెడ్డి, చిటికి శివారెడ్డి, అధికారులు, సంఘమిత్రలు, తదితరులు పాల్గొన్నారు

ములకలచెరువులో: ములకలచెరువులో గురువారం ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ పర్యటించారు. పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాల్లో జరిగిన కార్యక్రమాలకు హాజరయ్యేందుకు వెళ్తూ తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఇంటికి వచ్చారు. దీంతో టీడీపీ నేత జయచంద్రారెడ్డి ఎమ్మెల్సీ శ్రీకాంత్‌కు స్వాగతం పలికి సన్మానించారు. అలాగే ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, టీడీపీ నేత మంత్రి గిరిధర్‌రెడ్డిలు కూడా ఎమ్మెల్సీని సన్మానించారు.

పెద్దమండ్యం లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

పెద్దమండ్యం, సెప్టెంబరు 26: పెద్దమండ్యంలోని నాలుగు రోడ్లకూడలిలో గురువారం సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకి టీడీపీ, కూటమి నేతలు క్షీరాభిషేకం చేశారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాల్లో భాగంగా మండల టీడీపీ అధ్యక్షుడు జిట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కేక్‌కట్ చేసి కూటమి నేతలు పంబరాలు జరుపుకున్నారు. టీడీపీ సీనియర్ నేత, రాజంపేట పార్లమెంట్ బీసీసెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ కూటమి నేతలు వేంపల్లి రఫీ, నారా శ్రీనివాసులు, బాను, శ్రీనివాసులు, పెద్దన్న, రఘునాధ, డీవీరమణ, రెడ్డిపీరా, రమేష్, నాగూరు మస్తాన్‌వలీ, అస్రఫ్, ప్రకాష్‌రెడ్డి, తిమ్మయ్య పాల్గొన్నారు.

గంజాయి నివారణకు చర్యలు తీసుకోండి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 26: గంజాయి పూర్తిస్థాయిలో నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు. గురువారం మదనపల్లె పట్టణంలోని పోలీస్ స్టేషన్లను పరిశీలించారు. ముందుగా మదనపల్లె డీఎస్పీ కార్యాలయాన్ని పరిశీలించిన అనంతరం మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడుతో కలిసి మదనపల్లె వన్‌అండ్ టూ, తాలుకా పోలీస్‌స్టేషన్లు, పోలీస్ క్వాటర్స్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ క్వార్టర్స్‌ను దెబ్బతిన్న విషయాలను గమనించి వాటిని మర్మతు చేయించాలన్నారు. ప్రస్తుతం ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్స్ బదిలీలపై ఉన్నామన్నారు. కార్యక్రమంలో మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు, సీఐలు చంద్రశేఖర్, కళా వెంకటరమణ, రమేష్, రామచంద్ర, చాంద్‌బాషా, ఎస్ఐలు చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు26: ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీపీటీడీ కార్మిక పరిషత్ మదనపల్లె వన్‌డిపో యూనియన్ గౌరవాధ్యక్షుడు గుత్తికొండ త్యాగరాజ ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను కోరారు. ఆమేరకు యూనియన్ నాయకులతో కలిసి గురువారం వినతి పత్రం అందజేశారు. అనంతరం యూనియన్ నాయకులు ఎమ్మెల్యేను దుశ్శాలువ కప్పి పూలమాలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ రీజినల్ కార్యదర్శి పురుషోత్తం, డిపో సెక్రటరీ నాగరాజు, కేపీఎస్‌రెడ్డి, చలపతి, రాజన్న, రవినాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ.. ఆరుగురిపై కేసు నమోదు

కలకడ, సెప్టెంబరు 26:మండలంలోని కోన పంచాయతీ గం గిరెడ్డిగారిపల్లెలో భూతగాధ విషయమై ఘర్షణపడ్డ ఇరువ ర్గాలలోని ఆరు మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాం జనేయులు తెలిపారు. ఓ వర్గంలోని రమాదేవి ఫిర్యాదు మేరకు వెంకటరమణ, శివలపై అలాగే మరో వర్గంలోని వెంకటరమణ ఫిర్యాదు మేరకు రామచంద్ర, రమాదేవి, మల్లికార్జున, రమణలపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

60లీటర్ల సారా సీజ్..ఇద్దరు అరెస్టు

వాల్మీకిపురం, సెప్టెంబరు 26: .మండలంలోని కొత్తవండ్లపల్లెకు చెందిన చెన్న మధు(37), మరో వ్యక్తి మంజునాథ్(24)లు 60 లీటర్ల సారాను అక్రమంగారవాణా చేస్తుండగా అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు. ఈ దాడిలో వారి నుంచి 60లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకుని ఇరువురిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.

నిమ్మనపల్లిలో: నాటుసారాను విక్రయిస్తున్న రాజారెడ్డి(45) అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 10లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ముష్టూరు పంచాయతి యర్రప్పగారిపల్లి గ్రామ రాజారెడ్డి నాటుసారాను విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు తెలిపారు.

ఐదుగురు జూదర్ల అరెస్టు

పెద్దమండ్యం, సెప్టెంబరు 26: పెద్దమండ్యం మండలం చాకలపల్లి సమీపంలోని మామిడితోటలో జూదం ఆడుతున్న 5మంది జూదర్లను గురువారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ పీవీ రమణ తెలిపారు. జూదర్ల నుంచి రూ. 7200 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన వేగవంతం చేయండి


తహసీల్దారు కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

తంబళ్లపల్లె, సెప్టెంబరు 26: ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన వేగవంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. తంబళ్లపల్లె తహసీల్దారు కార్యాలయాన్ని కలెక్టర్ శ్రీధర్ చామకూరి గురువారం తనిఖీ చేశారు. మండలంలో జరుగుతున్న ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన ప్రగతిపై వీఆర్వోలు, సర్వేయర్లతో కార్యాలయంలో సమీక్షించారు. పీజీఆర్‌ఎస్‌లో భూమి సమస్యలపై వచ్చిన దరఖాస్తులు, ఎస్ఎల్‌ఏ పరిధిలో ఉన్నవి ఎన్ని..వాటి సమస్యలు, అందుకు తీసుకున్న చర్యలు తదితర వివరాలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై తగు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు 85 శాతం ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన పూర్తి చేశామని తహసీల్దారు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దారు హరికుమార్, ఎంపీడీవో సురేంద్రనాథ్, ఎంఈవో త్యాగరాజు, ఏపీవో అంజినప్ప, ఏపీఎం గంగాధర్, సీడీపీవో నాగవేణి, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, హౌసింగ్ ఏఈలు అశోక్, శేషు, సుజాత, ఈవోఆర్డీ దిలీప్‌కుమార్, ఏవో ఆనంద్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలను పటిష్టంగా నిర్వహించాలి

అంగన్వాడీ కేంద్రాలను పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సూచించారు. తంబళ్లపల్లె అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న టీచర్లు, ఆయాలు ఎంతమంది ఉన్నారు.? చిన్నారుల సంఖ్య? సరఫరా అవుతున్న గుడ్లు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రం పరిధిలో రక్త హీనత కలిగిన మహిళలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ఆయన సూచించారు.

పీజీఆర్‌ఎస్‌తో సత్ఫలితాలు...ప్రజలకు మేలు

● ఫ్రీహోల్డ్ రీవెరిఫికేషన్‌లో అవకతవకలు వెలికితీత

● హిట్ అండ్ రన్ కేసుల్లో విచారణతో సంతృప్తి ● సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్



మదనపల్లె టౌన్, సెప్టెంబరు 26: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో రెండు నెలల కాలంలో పీజీఆర్‌ఎస్(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టం) సత్ఫలితాలు ఇస్తోందని మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ పేర్కొన్నారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకర్లతో రెండు నెలల పాలనపై మాట్లాడారు. ప్రతి సోమవారం పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి వందల సంఖ్యలో అర్జీలు వస్తున్నాయని, వాటిని విచారించేందుకు సంబంధిత అధికారులకు సూచనలిస్తున్నామన్నారు. ఇందులో భూ సమస్య అయితే 60 రోజులు, సర్టిఫికేట్స్, ఎఫ్ లైన్ పిటిషన్స్, ఇతర సమస్యలు అయితే 30 రోజుల వ్యవధిలో విచారణ చేసి నివేదికలు సబ్‌కలెక్టరేట్‌కు పంపుతారన్నారు. కాని కొంత మంది అర్జీ దారులు కేవలం రెండు వారాలకే తమ సమస్య పరిష్కారం కాలేదని తిరిగి సబ్‌కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌కు వస్తున్నారన్నారు. వీటిపై ఆయా మండలాల అధికారులకు సూచనలిచ్చామని, సమస్య ఎంత వ్యవధిలో పరిష్కారమవుతుందో వివరించాలని చెప్పామన్నారు. డివిజన్‌లోని 11 మండలాల్లో 44వేల ఎకరాల ఫ్రీహోల్డ్ భూములపై రీవెరిఫికేషన్ చేశామని, అందులో 22,600 ఎకరాల భూమి ఫ్రీహోల్డ్ ప్రక్రియలో నిబంధనలు అతిక్రమించినట్లు తెలుస్తోందన్నారు. ముఖ్యంగా వయలేషన్, సరైన డాక్యుమెంట్లు లేకపోవడం, దరఖాస్తుదారులు లేకనే ఫైళ్లు కదలడం తదితర విషయాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. సీనియర్ సిటిజెన్స్ కేసులు విచారించి వారికి న్యాయం చేయడం బాధ్యతగా పనిచేస్తున్నామని, హిట్ అండ్ రన్ కేసుల్లో తనను జిల్లా విచారణ అధికారిగా నియమించడం, బాధిత కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం రూ.2లక్షల పరిహారం ఇస్తోందని గుర్తుచేశారు. డివిజన్‌లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక రీచ్‌లు లేవని, ఎవరిదైనా ప్రైవేటు భూముల్లో ఇసుక మేటలు ఉంటే వాటిని గుర్తించాలని తహసీల్దార్‌లను ఆదేశిస్తామన్నారు.

తంబళ్లపల్లె మోడల్ స్కూల్ విద్యార్థుల దాతృత్వం

తంబళ్లపల్లె, సెప్టెంబరు 26: విజయవాడ బుడమేరు వరద బాధితులకు తమ వంతు సహాయంగా ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.11,260లు విరాళం అందచేసి తంబళ్లపల్లె మోడల్ స్కూల్ విద్యార్థులు దాతృత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల విజయవాడలో వరదలు వచ్చిన నేపథ్యంలో వారిని ఆదుకునేందుకు మోడల్ స్కూల్ విద్యార్థులందరూ రెండు రోజులుగా విరాళాలు పోగుచేశారు. గురువారం తంబళ్లపల్లె పర్యటనకు వచ్చిన కలెక్టరు శ్రీధర్ చామకురిని తహసీల్దారు కార్యాలయం వద్ద మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ హేమంత్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి వరద బాధితుల సహాయార్థం విద్యార్థులు సేకరించిన విరాళాలను అందచేశారు. విద్యార్థుల దాతృత్వాన్ని కలెక్టర్ అభినందించారు.

మదనపల్లె యూత్ కరాటే క్లబ్ చిన్నారుల వితరణ

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 26: విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి మదనపల్లె యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ చిన్నారులు ఫ్యాకెట్ మనీ నుంచి కలెక్టు చేసి రూ. 22,250 సీఎం సహాయనిధికి డీడీ రూపంలో స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ విద్యార్థులు కరాటేలో, చదువుల్లో ముందు ఉండడంతోపాటు సాటి మనిషి కష్టాల్లో ఉన్నప్పుడు అండగా ఉంటామని సహాయం చేయడం వారి మానవత్వానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మదనపల్లె యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఏఆర్ సురేష్, మహేశ్వర్, మొహమ్మద్ ఐమాన్, రెహ్మాన్, కాలేషా, మస్తాన్, ఉమర్, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్ర సివిల్ సప్లైస్ బోర్డు సభ్యురాలికి ఘన సన్మానం


పర్వీన్‌తాజ్‌ను సన్మానిస్తున్న బి.కొత్తకోట నాయకులు

బి.కొత్తకోట, సెప్టెంబరు 26: రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి, రాష్ట్ర సివిల్ సప్లైస్ బోర్డు సభ్యురాలిగా నియమితులైన పర్వీన్‌తాజ్ ను పట్టణానికి చెందిన పలువురు నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నామినేటెడ్ పదవులలో రాష్ట్ర సివిల్ సప్లైస్ బోర్డు సభ్యురాలిగా ఆమె నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో పలువురు ఆమె నివాసానికి వెళ్లి పూలమాలలు, దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. భవిష్యత్‌లో పర్వీన్‌తాజ్ రాజకీయంగా మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. 2014 నుంచి 2019లో టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సభ్యురాలిగా, హిందూపురం పార్లమెంటరీ పార్టీ పరిశీలకురాలిగా పనిచేశారు. కార్యక్రమంలో నాయకులు డేరింగుల నారాయణ, చావిడికిట్టన్న, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వాల్మీకిపురం, సెప్టెంబరు 26: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలనిజెల్లా మలేరియా అధికారి (డీఎంవో) వేణుగోపాల్ పేర్కొన్నారు. గురువారం వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలో నిర్వహిస్తున్న లార్వా సర్వేను నాయనివారిపల్లెని సందర్శించారు. గ్రామంలో నీరు నిల్వ ఉంచుకున్న డ్రమ్ములు, బకెట్స్ వంటి వాటిని పరిశీలించి లార్వాలను గుర్తించారు. ప్రజలకు లార్వా వల్ల కలుగు అనార్థలపై అవగాహన కల్పించారు. అనంతరం చింతపర్తిలో ఉన్న బీసీ, సోషల్ వెల్ఫేర్ బాలుర వసతి గృహాలను తనిఖీ చేసి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈవసతి గృహాలలో మొదటి విడత మలాతీయాన్ దోమలు మందు పిచికారి చేయించారు. ఈకార్యక్రమంలో వైద్యులు సనాఆయేషా, హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్‌రఫీ, సబ్‌యూనిట్ అధికారి ముజీబ్, సూపర్‌వైజర్లు సుధాకర్, హాస్టల్ వార్డెన్ రవీంద్ర, ఏఎన్ఎం, హృద ఈశ్వరి, ఆరోగ్య కార్యకర్త వలిసాబ్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఆహారంతోనే ఆరోగ్యం

పెద్దమండ్యం, సెప్టెంబరు 26: చిరుధాన్యాల ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతులుగా ఉంటారని ఎపీడీవో శ్రీధర్‌రావు పేర్కొన్నారు. పెద్దమండ్యంలో గురువారం అంగన్‌వాడీ కేంద్రాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రాగులు, సామలు, సద్దలు, జొన్నలు పలు చిరుధాన్యాల ఆహారం తోనే మన పెద్దలు ఆరోగ్యవంతులుగా జీవితం గడిపారన్నారు. ప్రస్తుతం చిన్నారులకు, గర్భవతులకు, బాలింతలకు పోషకాలు కలిగిన ఆహారం అవసరమన్నారు. చిరుధాన్యాలు, పౌష్టిక విలువలు కలిగిన ఆహా ర పదార్థాలు తయారు చేసి ప్రదర్శన ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భవతులు, చిన్నపిల్లల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సీహెచ్‌సీ సీహెచ్‌వో క్రిష్ణయ్య, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

గృహనిర్మాణ పనులను వేగవంతం చేయాలి

పెద్దతిప్పసముద్రం సెప్టెంబర్ 26 : మండలంలోని వివిధ గ్రామాల్లోని లేఔట్‌లలో చేపడుతున్న గృహనిర్మాణ పనులను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి జె. మునిరాజ్ కుమార్ పేర్కొన్నారు. హౌసింగ్ ఏఈ. శ్రీనివాసులు, లేఔట్ స్పెషల్ ఆఫీసర్ ఉపాధిహామీ ఏపీవో తిరుపాలప్ప, ఎంపీడీ వో కేఎస్ బాలాజీ, ఈవోపీఆర్డీ యోగానంద్‌లతో కలిసి గురువారం ఆయన రంగసముద్రంలోని విసనకర్రవాండ్లపల్లె లేఔట్‌లో చేపడుతున్న గృహనిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో జరుగుతున్న గృహనిర్మాణాలను ఎప్పటికప్పుడు సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు వేగవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.